ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-1-2026 గురువారం సంపుటి: 31 సంచిక: 351 పేజీలు: 8+16 వెల: 6.50



అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్లు: కేంద్రం
భారత్‌లో ఉగ్రదాడులకు పాక్ కుట్ర! 5


## రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

### ప్రతినియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల: డి.సిఎం భట్టి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు తుమ్మల,అడ్లూరి

**ధర్మపురి, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంతోపాటు మండలంలోని నేరెళ్ల గ్రామంలో రూ.263.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి బుధవారం రాష్ట్ర మంత్రులైన తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల తోపాటు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇదేనా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుందని, అందుకే తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చామని అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని నిర్మించి, కుల మతాలకతీతంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. ధర్మపురి క్షేత్రంలో గోదావరి నీరు కలుషితం కాకుండా మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణం కోసం రూ.24.50 కోట్లతో వ్యయంతో పోటీ చేయడం జరుగుతుందని, ధర్మపురి పట్టణంలో రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాల కోసం రూ .15 కోట్లు,ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం రూ.10 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయం పట్ల నిరక్ష్యంగా వ్యవహరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయం అంటే ఒక పండుగలా మారిందని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం సిఎం రేవంత్, డి.సిఎం బట్టి విక్రమార్క, ఇతర మంత్రుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

## 47 మంది మున్సిపల్ కమిషనర్లు బదలీ

### ఎన్నికల వేళ భారీ మార్పులు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి21:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. పారిపాలన కారణాలతో పాటు ప్రమోషన్లతో కూడా అధికారులను బదిలీ చేసింది. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని చెప్పిన ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగణంగానే.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, మున్సిపల్ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించిందిన జీవో నెం.87ను బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి విడుదల చేశారు. ఒకే చోట సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, తమ సొంత జిల్లాలో పనిచేస్తున్న వారు బదిలీ అయిన జాబితాలో ఉన్నారు. పరిపాలన కారణాలతో పాటు ప్రమోషన్ల వల్ల కూడా బదిలీ అయిన వారు ఈ లిస్ట్‌లో ఉన్నారు. కాగా, సీవీఎన్ రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు.జి.రాజు క్యాతనపల్లి నుంచి బదిలీ అయి ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ముసాబ్ అహ్మద్‌ను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీ చేసి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. బి శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యారు.స్పెషల్ గ్రేడ్ కమిషనర్ డి జైత్ రామ్ ప్రమోషన్ పొంది జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్

>>2



### నాపై దాడిచేస్తే
## ఇరాన్‌ను లేపేస్తా
### ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

**వాషింగ్టన్, జనవరి 21:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య దశాబ్దాల కాలంగా ఉన్న వైరం ఇప్పుడు క్లైమాక్స్‌కు

>>2


ప్రధాని మోడీ అద్భుత నాయకుడు 2
దావోస్‌లో ప్రశంసించిన ట్రంప్


# 20వేల కోట్ల ఒప్పందాలు



దావోస్‌లో పలు కంపెనీలతో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న సిఎం రేవంత్ బృందం

### ఒకే రోజు పలు దిగ్గజ కంపెనీలతో సిఎం రేవంత్ బృందం చర్చలు

### రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్‌కు సన్నాహం

### రూ.12,500 కోట్ల పెట్టుబడికి రష్మి గ్రూప్ ఎంఒయు

### 12 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి21:** దావోస్ పర్యటనలో బిజీ బిజీగా ఉన్న తెలంగాణ రైజింగ్ బృందం బుధవారం ఒక్కరోజులో దాదాపు రూ.20వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ రాష్ట్రంలో పెట్టేవిధంగా వివిధ దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలును చేసుకుంది. డక్టైల్ ఐరన్ (డీఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్, తెలంగాణలో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్)-2026 సదస్సులో భాగంగా దావోస్‌లో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం రష్మి గ్రూప్‌తో కలిసి రూ.12,500 కోట్ల పెట్టుబడికి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్

>>2


జూ.మిస్ ఇండియాగా ఇందూరు అమ్మాయి 2

హన్మకొండ డిప్యూటీ కలెక్టర్ ఇంట్లో ఎసిబి సోదాలు..
7కోట్ల 69లక్షల 38వేల ఆస్తి సీజ్
13 (1),13(2) కేసు నమోదు 2

మొజాంబిక్ హక్కుల కార్యకర్తకు ఇందిర శాంతి పురస్కారం 5





Karimnagar: Adarsha Autoworld: 7337442380 | Varun Motors: 9640248417 | Adarsha Automotives: 7799784428 Warangal: Adarsha Automotives, Hanamkonda : 8886236633 | Win Motors: 8688827044 | Adarsha Auto World: 9133382182 | Nalgonda: Pavan Motor: 8790902165 | Nizamabad: Varun Motor: 9052901777 | Mahabubnagar: Sri Jayarama Motors: 9642826963.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.



బుధవారం పాట్నాలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద జెఇఇ మెయిన్స్ కోసం క్యూ లైన్‌లో ఉన్న విద్యార్థులు

# ప్రధాని మోడీ అద్భుత నాయకుడు

## దావోస్‌లో ప్రశంసించిన ట్రంప్

**దావోస్, జనవరి 21:** ప్రధాని నరేంద్రమోడీ అద్భుత నాయకుడు అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో బలమైన వాణిజ్య ఒప్పందం త్వరలో కుదురుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంతో గొప్ప ఒప్పందం కుదుర్చుకుంటాను అని ఆయన అన్నారు. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలపై ఆశావాదాన్ని నొక్కి చెప్పారు. రష్యన్ ఆయిల్ కొనుగోలు చేస్తుందనే కారణంతో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై 50 శాతం సుంకాలు విధించింది. అప్పటి నుంచి ఇరు దేశాల సంబంధాలు సున్నితంగా మారాయి. భారత్, యూఎస్ మధ్య వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది.

ముఖ్యంగా వ్యవసాయం, పాడి పరిశ్రమల్లోకి తమకు యాక్సెస్ కావాలని అమెరికా కోరుతోంది. అయితే, దీని వల్ల భారతదేశంలో వ్యవసాయంపై ఆధారపడిన వారిపై ప్రభావం పడుతుందని కేంద్రం అడ్డుచెబుతోంది. గతేడాది ఫిబ్రవరిలో చర్చలు జరపడానికి అంగీకరించినప్పటి నుంచి రెండు దేశాలు ఒప్పందానికి దగ్గరగా ఉన్నామని చెబుతున్నాయి. భారత్‌పై సుంకాలు 50శాతానికి పెంచడం, వాణిజ్య ఒప్పందానికి రాకుంటే మరిన్న సుంకాలు తప్పవన్న హెచ్చరికలు, రష్యా ముడిచమురు నిలిపివేయాలన్న ఆంక్షలకకు భారత్ ససేమిరా అంగీకరించకపోవడంతో ఇటీవలికాలంలో అమెరికాతో భారత్‌కు ఉన్న సంబంధాలు క్షీణించిన మాట నిజమే. ఈక్రమంలోట్రంప్ ప్రధానిమోడీని పొగడటం వెనుక వాణిజ్య ఒప్పందం ఖరారుచేసుకోడానికేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# నాపై దాడిచేస్తే ఇరాన్‌ను లేపేస్తా

>> చేరుకుంది. తనను హతమార్చేందుకు ఇరాన్ కుట్ర పన్నుతోందనే వార్తలు ఎక్కువవుతున్న క్రమంలో ట్రంప్ ఆ దేశానికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఒకవేళ ఇరాన్ తనపై దాడికి ప్రయత్నిస్తే ఆ దేశాన్ని భూమి మీదే లేకుండా తుడిచి పెట్టాలని తన అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఒక టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ నాకు చాలా స్పష్టమైన సూచనలు ఉన్నాయి. నాకు ఏమైనా జరిగితే ఇరాన్‌ను ఈ భూమి మీద నుంచి తుడిచి పెట్టేయండి అని నా సైనిక సలహాదారులకు చెప్పానని తెలిపారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఒక రోగిగా అభివర్ణించిన ట్రంప్ ఇరాన్‌కు కొత్త నాయకత్వం అవసరమని వ్యాఖ్యానించారు. నన్ను టార్గెట్ చేస్తే దేశాన్ని భూమిపై లేకుండా చేస్తానన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగానే స్పందించింది.

ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి జనరల్ అబుల్ ఫజల్ షేకర్చి ధీటుగా స్పందించారు. మా నాయకుడిని ఎవరైనా తాకాలని చూస్తే ఆ చేతిని నరకడమే కాదు వారి ప్రపంచాన్నే పూర్తిగా తగులబెడతాం అని హెచ్చరించారు. దీంతో ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం కాస్తా యుద్ధ వాతావరణానికి దారితీస్తోంది. గత ఏడాది కాలంగా ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంపై జరుగుతున్న నిరసనలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తోంది. మానవ హక్కుల సంస్థల సమాచారం ప్రకారం.. ఈ ఆందోళనల్లో ఇప్పటి వరకు 4,519 మంది పౌరులు మరణించారు. సుమారు 26,300 మందిని ఇరాన్ భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ ఆరోపిస్తుండగా శాంతియుత నిరసనకారులను చంపడం సరికాదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదే కొనసాగితే తమ దేశం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

# 47 మంది మున్సిపల్ కమిషనర్లు బదలీ

>> బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమోషన్ పొందిన బి శరత్ చంద్ర నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లనున్నారు.బదిలీ అయిన అధికారులు వెంటనే నియమించిన ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో.. విధుల్లో చేరడంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పింది. 1. రామగుండం గ్రేడ్ 3మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు 2. రాయికల్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా కీర్తి నాగరాజు 3.హాలియా గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి 4. అమరచింత గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా నురుల్ నజీబ్. 5. వేములవాడ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సంపత్ కుమార్. 6. ములుగు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రమేష్, 7.తిరుమలగిరి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రామ చంద్ర రావు, 8. ఆదిలాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా జి. రాజు, 9. ఎదులపురం గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా మునవార్, 10. బెల్లంపల్లి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సంపత్, 11. భూత్పూర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా చంద్ర శేఖర్ రావు, 12. నడికొండ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా మురళి, 13. అచ్చంపేట గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ వేణు, 14. కల్లూరు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రామదుర్గ రెడ్డి, 15. హుజూర్ నగర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా బీ శ్రీనివాస్,16. చొప్పదండి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా టీ మనోహర్, 17. హుజురాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా ముసబ్ అహ్మద్, 18. మంచిర్యాల గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా జి అన్వేష్, 19. ఆలేరు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి, 20. మొయినాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమీషనర్‌గా జకీర్ అహ్మద్ బదిలీ చేసింది. వీరితో పాటు మరో 27 మంది బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.



# జూ.మిస్ ఇండియాగా ఇందూరు అమ్మాయి

**నిజామాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో క్లార్స్ అమేర్ వేదిగా ఈనెల 8న జుమీ లక్స్ సంస్థ నిర్వహించిన జూనియర్ మిస్ ఇండియా పోటీల్లో నిజామాబాద్ నగరానికి చెందిన సహస్ర రాథోడ్ విజేతగా నిలిచింది. జూనియర్ మిస్ ఇండియా 2024 (సీజన్ 4)లో బెస్ట్ పర్సనాలిటీ అవార్డును సహస్ర కైవసం చేసుకుంది. నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన సహస్ర గత నెల హైదరాబాద్‌లో నిర్వహించిన అడిషన్స్‌లో పాల్గొని పోటీలకు అర్హత సాధించింది. 11 నుంచి 12 సంవత్సరాల వయస్సు కేటగిరిలో తెలంగాణ నుంచి ఆమె విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 172 మంది పాల్గొనగా జూనియర్ మిస్ ఇండియా కిరీటం సహస్రకు దక్కింది. సహస్ర జూనియర్ మిస్ ఇండియా విజేతగా నిలవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసున్నారు. సహస్ర తండ్రి ప్రదీప్ రాథోడ్ మాట్లాడుతూ 4రౌండ్లను దాటుకుని చివరి ఫినాలేలో సహస్ర విజేతగా ఎంపికైందని అన్నారు.

# హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలి 'స్విస్ మాల్'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి21:** ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) 2026 సందర్భంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భారత్-స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు.

## వారం - వర్జ్యం

22-01-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం,ఉత్తరాషాఢ కార్తె
చవితి రా.2.27
శతభిష మ.2.24,
వర్జ్యం : సా.6.39-7.43
దు.ఉ.10.26-11.11,
2) మ.2.58-3.43
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**వృషభం:** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. ఇతరులు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు.

**మిథునం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఉద్యోగపరముగా రావలసిన సౌకర్యాలు ఇబ్బందులకు గురిచేస్తాయి.

**కర్కాటకం:** డాక్యుమెంట్లు, ముద్రణాపరమైన రానిబాకీలు, భూమి, స్థిరాస్తుల సంబంధితమైన విషయాలు నిదానంగా సాగుతాయి.

**సింహం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులను దూరంగా ఉంచండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది.

**కన్య :** కుటుంబంలో చెప్పుకోదగిన మార్పులు ఏర్పడవు. అంతా మంచికే అనుకొని సర్దుకుపోవటం మంచిది.

**తుల :** ఓర్పు నేర్పులు మేలుచేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. ధనలాభం.

**వృశ్చికం:** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి.

**ధనుస్సు:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. ఇతరుల విషయంలో జోక్యం వద్దు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** బంధువుల నుండి మాట సహాయం పొందుతారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి.

**మీనం:** ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 20వేల కోట్ల ఒప్పందాలు

>> బాబును సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ విభిన్న పరిశ్రమలతో బలమైన పారిశ్రామిక వ్యవస్థగా ఎదుగుతోందని , ముఖ్యంగా తయారీ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సహాయాలు, బొగ్గు సరఫరా లింకేజీలు సహ అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రష్మి గ్రూప్ ప్రమోటర్ సజ్జన్ కుమార్ పట్వారి, డైరెక్టర్ సంజిబ్ కుమార్ పట్వారి తెలంగాణ రైజింగ్ బృందంతో భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ లేబర్-ఇంటెన్సివ్ తయారీ విధానంతో పనిచేస్తుందని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని డైరెక్టర్ సంజిబ్ కుమార్ తెలిపారు. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యంపై కూడా చర్చలు జరిగాయి. రష్మి గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర,దక్షి ణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తెలంగాణలో రూ.6 వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్ ఈఓఐ సమర్పించిన స్లోవాకియాకు చెందిన సంస్థ న్యూక్లర్ క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సమర్పించింది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక-2026 సమావేశాల సందర్భంగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా.జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ, డైరెక్టర్ మెలుగు శ్రీపాల్ రెడ్డి , స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి నెట్-జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ప్రధానమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడింది. గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణ లో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడి విలువ 600 మిలియన్ యూరోలు (సుమారు రూ.6,000 కోట్లు).

**1,000 కోట్ల పెట్టుబడికి అమెరికా సంస్థ సర్గాడ్ ఎంవోయూ**

విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థ రాష్ట్రంలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సర్గడ్ సంస్థ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా దావోస్‌లో, సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ (ఎంఆర్ఓ) కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు. సర్గాడ్ సంస్థకు ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో విశేష అనుభవం ఉంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను మూడు ప్రత్యేక జోన్లు గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సేవల రంగానికి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్), తయారీ రంగానికి పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), వ్యవసాయం, గ్రీన్ ఎకానమీ కి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ (రేర్) లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్వో కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సంస్థ సీఈఓకు సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ పెట్టుబడులతో తెలంగాణలోని ఎంఎస్ఎంఈ లకు పరికరాల తయారీ రంగంలో కొత్త అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# మేడారంలో మండమెలిగే పండుగ

## తొలి ఘట్టంతో సమ్మక్క-సారలమ్మ మహాజాతర షురూ

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త:** దక్షిణాది ఆదివాసి కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మల మహా జాతర ఈనెల 28 నుండి 31 వరకు జరగనున్న నేపథ్యంలో బుధవారం మేడారంలో మండే మెలిగే పండగ ఘనంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర తొలి ఘట్టాన్ని బుధవారం ఆవిష్కరించింది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా గుర్తింపు పొందిన ఈ మహాజాతర ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం మండమెలిగే పండుగతో అధికారికంగా బుధవారం ప్రారంభమైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఇప్పటికే మేడారానికి తరలివస్తున్నారు. సమ్మక్క-సారలమ్మలు కేవలం దేవతలే కాదు.. ఆదివాసీ ఆత్మగౌరవానికి, అణచివేతపై పోరాటానికి ప్రతీకలు. కాకతీయుల కాలంలో అన్యాయ పన్నుల విధింపును ఎదిరించి పోరాడిన గిరిజన వీరమాతలుగా కోయ గిరిజనులు వీరిని ఆరాధిస్తారు. అటువంటి వనదేవతల స్మరణతోనే మేడారం మహాజాతర ప్రారంభమవడం విశేషం.

**ముందస్తు మొక్కులతో మేడారంలో భక్తుల రద్దీ..**

మహాజాతర ఇంకాపూర్తిగా ఊపందుకోకముందే భక్తులు భారీగా మేడారానికి చేరుకుంటున్నారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. తమ మొక్కులు చెల్లించేందుకు బెల్లం (బంగారం)తో పాటు కొబ్బరికాయలు, చీరలు సమర్పించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. బుధవారం సుమారు 80 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు.



దావోస్‌లో సిఎం రేవంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సినీ నటుడు చిరంజీవి

# ప్రతి జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు

## దావోస్ వేదికపై సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన

### 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో తెలంగాణ విజన్ ప్రదర్శన

### ప్రత్యేక ఆకర్షణగా సినీ నటుడు చిరంజీవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి21:** ప్రతి ఏడాది జులై లో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (జూనినీ) ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన జాయిన్ ది రైజ్ కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించిందని సీఎం తెలిపారు. 'ప్రతి ఏడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తాం.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం'అని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు (జిసిసి) ప్రధాన కేంద్రంగా మారిందని సీఎం అన్నారు. మూసీ నది పునరుజ్జీవనంతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసి నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి పెడుతామని చెప్పారు.దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైజింగ్ 2047-విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (టిఏఐహెచ్), తెలంగాణ నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను ఆవిష్కరించారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెర్వులు కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్‌చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాల పరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని అన్నారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రితో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.




ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు 2026ను బుధవారం న్యూఢిల్లీలో జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

# లైఫ్ సైన్సెస్‌లో యుస్ 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 5లక్షల ఉద్యోగాల లక్ష్యం

## నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి21:** స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ పాలసీని విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ విధానం పరిమాణాత్మక ఉత్పత్తి ఆధారిత తయారీ నుండి విలువ ఆధారిత, ఆవిష్కరణలచే నడిచే వృద్ధి వైపు ఒక నిర్ణయాత్మక మార్పును స్పష్టం చేస్తుంది. ఆవిష్కరణ, అభివృద్ధి , విస్తరణల వ్యాప్తంగా తెలంగాణను ప్రపంచవ్యాప్తంగా అనుసంధానించబడిన లైఫ్ సైన్సెస్ హబ్‌గా నిలబెడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి ఐదు లైఫ్ సైన్సెస్ క్లస్టర్‌లలో ఒకటిగా నిలవాలనే స్పష్టమైన ఆశయంతో, ఈ విధానంను రూపొందించారు.యుఎస్ 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యంగా ఆ పాలసీని విడుదల చేశారు.ఈ రంగంలో 5లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది.ఈ పాలసీ ఉత్తమ పరిశోధనాభివృద్ధి, అధునాతన బయోలాజిక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వనుంది. థెరపీలతో పాటు పర్యావరణహిత ఉత్పత్తులే ప్రాధాన్యంగా పాలసీని రూపొందించింది. నూతన లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ సందర్భంగా పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ పాలసీని ఆవిష్కరించిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దావోస్‌లో జరిగిన ఈ పాలసీ ప్రపంచవ్యాప్త ఆవిష్కరణ, లైఫ్ సైన్సెస్‌లో తదుపరి దశ వృద్ధి అనేది క్రాస్ బోర్డర్ ల మధ్య భాగస్వామ్యాలు, ప్రపంచ పెట్టుబడులు, భాగస్వామ్య ఆవిష్కరణ అజెండాల ద్వారా నడపబడుతుందనే తెలంగాణ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలలోనే, మేము రూ. 73,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాము. కొత్త పాలసీ విడుదలతో, రాబోయే ఐదు సంవత్సరాలలో రూ.రెండు లక్షల కోట్లను ఆకర్షించాలనే ఉన్నత లక్ష్యంతో మేము ఉన్నామన్నారు. లైఫ్ సైన్సెస్ పాలసీలో భాగంగా ప్రభుత్వం ఓఆర్ఆర్ వెంబడి 10 ఫార్మా విలేజ్‌లు, గ్రీన్ ఫార్మా సిటీ, వైద్య పరికరాల పార్కును కూడా ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. జీనోమ్ వ్యాలీని మరింతగా విస్తరించనుందన్నారు. లైఫ్ సైన్సెస్ కోసం రూ.1000 కోట్ల ఇన్నోవేషన్ నిధిని కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ పాలసీ సెల్, జీన్ థెరపీలు, పెప్టైడ్‌లు, ప్రెసిషన్ ఫెర్మెంటేషన్ ఇతర తదుపరి తరం పద్ధతులతో సహా ఫ్రాంటియర్ సైన్స్ అధునాతన ఉత్పాదక ప్లాట్‌ఫారమ్‌లకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇది క్లినికల్ పరిశోధన, ఫార్మా సేవలు, డయాగ్నస్టిక్స్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ డిజిటల్ హెల్త్ రంగాలలో విస్తృత వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. ప్రపంచ లైఫ్ సైన్సెస్ కేంద్రాలకు తెలంగాణను ఒక ప్రధాన గమ్యస్థానంగా నిలబెడుతుందని అన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ విధానం బలమైన పునాది , ఆవిష్కరణ స్ఫూర్తిపై నిర్మించబడింది. ఈ పాలసీ కేవలం ఒక కార్యాచరణమాత్రమే కాదు; ఇది ఏఐ, డిజిటల్ హెల్త్ ,తదుపరి తరం చికిత్సా విధానాలు వంటి పురోగతి సాంకేతికతలను స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి రూపొందించబడిందన్నారు. అదే సమయంలో నైపుణ్యం కలిగిన ప్రతిభను పెంపొందిస్తుంది.

# హన్మకొండ డిప్యూటీ కలెక్టర్ ఇంట్లో ఎసిబి సోదాలు..

## 7 కోట్ల 69లక్షల 38వేల ఆస్తి సీజ్..

## 13 (1),13(2) కేసు నమోదు

**హన్మకొండ బ్యూరో. జనవరి 21, ప్రభాత వార్త:** హన్మకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,ఆదాయానికి మించిన ఆస్తులు కూడ బెట్టినట్లు ఆరోపణలు రావడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు బుధవా రం ఉదయం సోదాలు నిర్వహించారు. వెంకట్ రెడ్డి నివాసంతో పాటు..ఆయన కు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేసారు. 7కోట్ల 69లక్షల 38వేల ఆస్తి సీజ్ చేయగా, 13(1),13(2) కేసు నమోదు చేసారు. తెలంగాణ వ్యాప్తంగా బుధవారం ఉదయం నుండి మొత్తం పది చోట్ల సోదాలు జరిపినట్లు అధికారు లు తెలిపారు. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, హన్మకొండలోని ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 1.2ఇండ్లలో 4 కోట్ల 65 లక్షలు, 2.కమర్షియల్ షాప్. 60లక్షలు, 3.8 ఓపెన్ ప్లాట్స్ 65లక్షలు, 4.వ్యవసాయ భూమి 14.25 లక్షలు. 5.30లక్షల నగదు. 6.బ్యాంకు బాలన్స్. 44లక్షలు 7.ఇంటి సామాను. 11లక్షలు 8.వాహనాలు. 40లక్షలు 9. బంగారం 43.50లక్షలు మొత్తం దాదాపు 7.69 కోట్ల విలువైన ఆస్తులను వారు గుర్తించి సీజ్ చేసారు. పదవిని అడ్డం పెట్టుకొని వందల కోట్ల విలువైన ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు ఉండటంతో మొదటి ఏసిబి అధికారులు ప్రాథమిక విచారణ జరిపి... అనంతరం అధికారి కలెక్టర్ ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసుకుని సోదాలు చేసారు.

# తల్లి కళ్లముందే ఆగిన చిన్నారి ఊపిరి

## ఆర్మీ వాహనం కింద పడి విద్యార్థి మృతి, తల్లికి తీవ్ర గాయాలు



మృతిచెందిన నైజెన్ తమాంగ్ (ఫైల్)

**నేరేడ్‌మెట్, జనవరి 21 ,ప్రభాతవార్త :** పాఠశాలకు తీసుకెళ్తున్న తల్లి కళ్లముందే కుమారుడు ప్రాణాలు విడిచిన హృదయ విదారక ఘటన నేరేడ్మెట్‌లో పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్కే పురం ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్న నీలాంగ్ తమాంగ్ (32) తన కుమారుడు నైజెన్ తమాంగ్ (8)ను స్కూటీపై ఆర్మీ పబ్లిక్ స్కూల్, ఆర్కే పురానికి తీసుకెళ్తుండగా బుధవారం ఉదయం సుమారు 7.30 గంటలకు ప్రమాదం జరిగింది. ఆఫీసర్స్ కాలనీ రోడ్డుపై వెళ్తున్న సమయంలో స్కూటీ అకస్మాత్తుగా స్కిడ్ కావడంతో తల్లి-కుమారుడు రోడ్డుపై పడిపోయారు.అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆర్మీకి చెందిన వాహనం (మాడిఫైడ్ స్కూల్ బస్) చిన్నారి మీదుగా వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వాహనం చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడిన నైజెన్ తమాంగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఎదుటే కుమారుడి ప్రాణాలు పోవడంతో ఆమె తీవ్రంగా కేకలు వేయగా, స్థానికులు పరుగులు తీస్తూ సంఘటన స్థలానికి చేరుకున్నారు .ప్రమాదంలో గాయపడిన నీలాంగ్ తమాంగ్‌ను వెంటనే ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమెకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై మృతుడి తల్లి మామ రాజు తప ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆర్మీ వాహనం వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం వంటి అంశాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని డ్రైవర్‌ను విచారిస్తున్నట్లు సమాచారం. నివాస ప్రాంతాల్లో భారీ వాహనాల వేగ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు పూర్తి దర్యాప్తు అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# హైకోర్టు ఆదేశాలతో చలాన్ల వసూళ్లకు బ్రేక్

## సర్కారుతో చర్చించాక తదుపరి నిర్ణయం



**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** కొన్ని నెలలుగా వాహనదారుల నుంచి బలవంతంగా పెండింగ్ చలాన్లు వసూలు చేసిన ట్రాఫిక్ పోలీసులు హైకోర్టు ఆదేశాలతో బుధవారం ఉదయం నుంచి దీనికి బ్రేక్ వేశారు. నిబంధనలను పాటించని వాహనదారులు, హెల్మెట్ లేకుండా వెళుతున్న వారు, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిని పోలీసులు అనేకచోట్ల ఆపినా వారికి చలాన్లు జారీ చేయడంతోనే సరిపుచ్చారు. పెండింగ్ చలాన్లు వున్న వాహనదారులను వెంటనే చలాన్లు చెల్లించాలని కోరుతూ పంపించి వేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసుల నుంచి సర్కారు ఖజానాకు బుధవారం ఎలాంటి రాబడి రాలేదు. కొందరు స్వచ్ఛందంగా చెల్లించిన చలాన్లు మినహాయించడంతో సర్కారీ ట్రెజరీకి చలాన్ల రాబడి పెద్దగా అందలేదు. మరోవైపు పెండింగ్ చలాన్ల వసూళ్లపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై పోలీసు ఉన్నతాధికారులు సర్కారుతో సమాలోచనలు జరపాలని భావిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో వున్నందున ఆయన రాగానే దీనిపై అత్యవసరంగా చర్చించి తగిన నిర్ణయం తీసకునే వీలుంది. రాష్ట్ర వ్యాప్తంగా వాహనదారుల నుంచి పోలీసులు బలవంతంగా వసూలు చేస్తున్న చలాన్ల విషయంలో హైకోర్టు మొట్టికాయ వాహనదా రులకు పెద్ద ఊరటనిచ్చింది. ట్రాఫిక్ పోలీసులతో పాటు ఆయా ప్రాంతాల సివిల్ పోలీసులు కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు గంటల పాటు రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులను ఆపి పెండింగ్ చలాన్లు వుంటే బలవంతంగా వసూలు చేస్తుండడం తెలిసిందే. ఒకవేళ వాహనదా రుల వద్ద డబ్బులు లేకున్నా వారిని వదలిపెట్టక పోవడంతో వారు తప్పని సరి ఇతరుల నుంచి డబ్బులు తెప్పించి మరీ చలాన్లు కట్టే పరిస్థితులు వుండడం విదితమే. దీనివల్ల అనేకచోట్ల ట్రాఫిక్ జాంలు ఏర్పడి సాధారణ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిన ఉదంతాలున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ సమయంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను గాలికి వదిలేసి పెండింగ్ చలాన్ల వసూలు కోసం రోడ్లపై కాపుకాయడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై న్యాయ వాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించి ఈ విషయంలో పోలీసులను కట్టడి చేయాలని కోరారు. దీనిపై విచారించిన హైకోర్టు పెండింగ్ చలాన్లను వాహనదారుల నుంచి బలవంతంగా వసూలు చేయరాదని ఆదేశించడం తెలిసిందే. ట్రాఫిక్ పోలీసులు కేవలం ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించాలని, వాహనదారులను దొంగల్లా వెంటాడడం సరికాదని ఆదేశించింది. వాహనదారుల నుంచి పెండింగ్ చలాన్లు వ సూలు చేయాలంటే చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి వారిని విచారించాలి తప్పించి వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు పలికింది. మంగళవారం హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేయగా బుధవారం దీని ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంగా స్పష్టంగా కనిపించాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విషయం ఎలావున్నా జంట నగరాలు, శివార్లలోనే పోలీసులు వాహనదారులతో అతిగా ప్రవర్తించినట్లు అభియోగాలు వచ్చాయి. హైకోర్టు ఆదేశాలతో బుధవారం ఉదయం నుంచి ట్రాఫిక్ పోలీసుల అతి కనిపించలేదు. వాహనదారులను ఆపి పత్రాలను తనిఖీ చేయడం, నిబంధనలు పాటించని వారిని ఆపడం వంటివి చేసినా వారిని మందలించి కొత్తగా చలాన్లు జారీ చేయడం, పాతవివుంటే కట్టాలని కోరడం తప్పించి వాహనదారులను ఇబ్బందులకు గురిచేసినట్లు ఎక్కడా కనిపించలేదు.

**సిఎంతో చర్చించిన తరువాత తదుపరి నిర్ణయం**

ఇదిలావుండగా పెండింగ్ చలాన్ల విషయంలో హైకోర్టు ఆదేశాలపై పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ చలాన్ల వసూలు వల్ల వా హనదారుల్లో కొంత భయం వుండడంతో పాటు క్రమశిక్షణతో మెలిగేవారని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో సర్కారు ఖజానాకు ఆదాయం కూడా వచ్చేదని వారంటున్నారు.తమ విధులను కొందరు తప్పుగా భావించడం వల్ల ఇలా జరిగిందని, దీనిపై సిఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తరువాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని వారంటున్నారు.

# ప్రశ్నపత్రాల లీకేజ్ వ్యవహారంపై డిజిపికి ఫిర్యాదు

**అత్తాపూర్.జనవరి21,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వెలుగులోకి వచ్చిన ప్రశ్నపత్రాల లీకేజ్ వ్యవహారంలో వర్సిటీ అధికారులు కఠినంగా వ్యవహారిస్తున్నారు.లీకేజీకి సహకరించిన ఉన్నతాధికారులు, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిజిపికి వర్సిటీ అధికారికంగా ఫిర్యాదు చేసింది.వరంగల్ మరియు జగిత్యాల వ్యవసాయ కళాశాలల్లో ప్రశ్నపత్రాల లీకేజీకి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిజిపికి లేఖ రాసినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ డా. అల్దాస్ జానయ్య తెలిపారు.ఇప్పటికే అగ్రికల్చరల్ బి.ఎస్సి చదువుతున్న ఇన్ సర్వీస్ విద్యార్థులతో పాటు ముగ్గురు బోధనా సిబ్బంది మరియు ఒక బోధనేతర సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశామని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సెమిస్టర్ ఫైనల్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, ప్రశ్నపత్రాల తయారీ ప్రక్రియలో మార్పులు తీసుకు రావడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పుష్పాచక్రపాణి

# అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీపై శిక్షణ

**హైదరాబాద్(జూబ్లీహిల్స్), జనవరి 21, ప్రభాతవార్త:** మారిన పరిస్థితులకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ద్వారా అందించడం వల్ల సమయం ఆదా కావడమే కాకుండా పారద ర్శకత, జవాబుదారీతనం పెరగనుందని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ. జి.పుష్పా చక్రపాణి వివరించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సి.ఎస్.టి.డి.) ఆధ్వర్యంలో 'బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ'పై నాలుగు అర్ధ రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ విద్యార్థులకు త్వరితగతి డిజిటల్ సర్టిఫికెట్‌లను జారీ చేయడానికి, ధృవీకరించడానికి, వాటి కచ్చితమైన ప్రామాణికతను నిర్ధారించడానికి, ఫోర్జరీని నిరోధించడానికి ఉపయోగపడుతుందన్నారు. త్వరలోనే విశ్వవిద్యాలయంలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొ. పి. వెంకటరమణ, సాఫిరస్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంప్లిమెంటేషన్ మేనేజర్ అరేపల్లి ఓంశ్రీనివాస్, బ్లాక్‌చెయిన్ నిపుణురాలు, హారిణి రవికుమార్, అన్ని విభాగాల అధిపతులు, డైరెక్టర్లు, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

**అంబేద్కర్ వర్సిటీలో ఐడియా రెండు రోజుల జాతీయ సదస్సు**

ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'సరిహద్దులకు అతీతంగా సరికొత్త దిశలో సార్వత్రిక విద్య' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, ఐడియా అధ్యక్షుడు, విశ్వవిద్యా లయ మాజీ ఉపకులపతి ఆచార్య కె. సీతారామారావు, ఇతర అధికారులు, ఐడియా ప్రతినిధులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సును మార్చి 25, 26 తేదీలలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ ఆచార్య జి. పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణా రెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ అధ్యాపకులు, ఐడియా ఉపాధ్యక్షులు ప్రొ. జిలాని, మానూ యూని వర్సిటీ అధ్యాపకులు ఐడియా ప్రతినిధి ఆచార్య ముస్తాక్ అహ్మద్, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు ఆచార్య సుధారాణి, ప్రొ.రవీంద్రనాథ్ సోలమన్, ఆచార్య వెంకటరమణ, డా. వెంకటేశ్వర్లు, డా. బనోత్ ధర్మ, మాజీ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ ఎస్.వి. రాజశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ సి. వెంకటయ్య, డా.పి. కృష్ణా రావు, జి. మల్లారెడ్డిలతోపాటు డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు.

# ఎపి బనకచర్ల పై సుప్రీంలో సూట్

## సమ్మక్క సాగర్‌కు ఎన్వోసీకై ఛత్తీస్‌గఢ్‌తో చర్చలు

## రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వివాదంగా మారింది. గోదావరి జల వివాద ట్రైబ్యునల్ అవార్డుకు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి ఈ ప్రాజెక్టు వ్యతిరేకమని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఏపీ ముందుకు వెళ్లకుండా నిరోధించాలని కేంద్రాన్ని కోరుతోంది. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా నాగార్జున సాగర్‌ను వినియోగించడాన్ని ప్రధానంగా తెలంగాణ తప్పు పడుతోంది. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సూట్ వేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సూట్ వేసేందుకు ఇరిగేషన్ లీగల్ సమస్యలపై న్యాయ నిపుణుల నుండి సలహాలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి డ్రాఫ్ట్ సిద్ధమయ్యాక అటార్నీ జనరల్‌తో చర్చించిన అనంతరం సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనుంది. మరోపక్క తెలంగాణలో చేపడుతున్న సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్వోసీ తీసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు దీనికి సంబంధించి త్వరలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా ఇప్పటికే పోలవరంనల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు పైనా తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్ను వెనక్కి సైతం తీసుకుంది. సివిల్ సూట్ రూపంలో మళ్లీ దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో బనకచర్లపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుపైనా సూట్ వేయాలని నిర్ణయించుకుంది.

# 5 అసెంబ్లీ ఎన్నికలకు నబీ 'కార్యాచరణ'

## పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు, తొలి రోజు బిజెపి అధ్యక్షుడు నితిన్ బిజీబిజీ, కేరళ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు వినోద్ తవ్డేకు

## బెంగళూరు కార్పోరేషన్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా రామ్ మాధవ్ నియామకం



**న్యూఢిల్లీ, జనవరి 21:** బిజెపి నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి రోజు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. పార్టీ సీనియర్ నాయకుల నుంచి నబీన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. పార్టీ కార్యాలయంలోకి అడుగుపెట్టిన వెంటనే బిజెపి రాష్ట్రాల అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలియజేశారు. అనంతరం జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీల అధ్యక్షులతో సమావేశమయ్యారు. తద్వారా సంస్థాగత సమావేశానికి అధ్యక్షత వహించి, పార్టీ చీఫ్‌గా అధికారికంగా విధుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో ప్రధానంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై సమాలోచనలు జరిపారు. అలాగే పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చలు జరిపారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కొత్త నాయకత్వంలో పార్టీ సంస్థాగత, రాజకీయ దిశను నిర్ణయించడంపై సమావేశం దృష్టి సారించింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధిపతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కొత్తగా నియమితులైన బిజెపి రాష్ట్ర అధ్యక్షులను పరిచయం చేయడం సమావేశం అజెండాలోనే ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కొత్త జాతీయ అధ్యక్షుడి ఆధ్వర్యంలో బిజెపి ఎన్నికల లక్ష్యాలతో సంస్థాగత ప్రాధాన్యతలను సమన్వయం చేయడం లక్ష్యంగా చర్చలు జరిగాయని పార్టీ నాయకులు తెలిపారు. నితిన్ నబీన్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తన మొదటి సంస్థాగత నియామకాలను ప్రకటించారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జులు, సహ-ఇన్‌చార్జులను నియమించారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు సీనియర్ నాయకుడు వినోద్ తవ్డేకు అప్పగించారు. అలాగే బెంగళూరు కార్పోరేషన్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా రామ్ మాధవ్ నియమితులయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నియామకాలు సంస్థాగత, ఎన్నికల నిర్వహణ అర్హతలు కలిగిన అనుభవజ్ఞులైన నాయకులకు కొత్త అధ్యక్షుడు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, బలోపేతం చేయడంతోపాటు ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళికా రచనపై కూడా దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# భారీగా మిర్చి ధరలు

## క్వింటాలు రూ.23 వేలుకు పైగా చేరిక

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మిర్చి ధరలు భారీగా పెరిగాయి. ప్రధానంగా రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు తగ్గడం, పచ్చళ్ల సీజన్ కావడంతో మిరపపొడికి వినియోగించే మిర్చి క్వింటాల్ మార్కెట్లో 23 వేల రూపాయలకు పైగా దాటింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, మలక్‌పేట్ మార్కెట్‌తో పాటు, గుంటూరు మిర్చియార్డులో 341, దేవనూర్ డీలక్స్ రకాలకు ధర బాగా పెరిగింది. దేవనూర్ డీలక్స్ మిర్చి ఏకంగా నాలుగు వేల రూపాయలు పెరిగింది. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో బుధవారం తేజ రకం మిర్చికి రికార్డు ధర పలికింది. జాఫర్ ఘడ్ మండలం కునూర్ గ్రామానికి చెందిన సమ్మిరెడ్డి రైతు తెచ్చిన ఈ రకం మిర్చికి క్వింటాలుకు 20,200 రూపాయలు పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ మార్కెట్ లో 2023 తరవాత ఈ రకం మిర్చికి ఇదే అత్యధిక ధర కావడం విశేషం. కాగా రెండు రాష్ట్రాల్లోనూ ఈనెల 6న క్వింటా రూ.20,500 పలికిన ఈ మిరపకాయల ధరలు క్రమంగా పెరుగుతూ రూ.23వేలకు చేరింది. ముఖ్యంగా 341, 355, దేవనూర్ డీలక్స్ వంటి రకాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దిగుబడులు తగ్గడం, కారం మిల్లులు, పచ్చళ్ల తయారీలో ఈ రకాలకు మంచి ఆదరణ ఉండటంతో వీటి ధరలు అమాంతంగా పెరిగాయి. గడిచిన నెల రోజులుగా రైతులు కొత్త మిర్చితో పాటు పాత మిర్చిని తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ప్రతి రోజు వంద నుంచి రెండు వందల క్వింటాళ్ల వరకు మిర్చి మార్కెట్ కు వస్తోంది. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో దేవనూరు డీలక్స్ రకం మిర్చి ధర క్వింటా రూ.4వేలకు పైగా ధర పెరగగా, 341, 334, నంబర్5 రకం మిర్చిలు ధరలు పెరిగి డీలక్స్ రకంతో పోటీపడుతున్నాయి. గత నెల రోజులుగా గుంటూరు మిర్చియార్డుకు కారం మిర్చి సరఫరా బాగా తగ్గిపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# టిటిడి జెఇఒగా డాక్టర్ శరత్

**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలతిరుపతిదేవస్థానం ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు, ఆలయ పవిత్రతను కాపాడే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు మరో కీలకమైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.శరత్‌ను నియమిం చారు. సాధారణంగా టిటిడి పాలన వ్యవహారాల్లో ఇప్పటివరకు సర్వీసులో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారులే ఇఒ,జెఇఒలుగా నియమింపబడేవారు. అయితే ఈ సారి అందుకు భిన్నంగా సిఎం చంద్రబాబు తనకు నమ్మకస్థుడైన విశ్రాంత అధికారిని టిటిడి జెఇఒగా నియమించడం టిటిడి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : సిద్ధిపేట సర్కిల్
టెండరు ప్రకటన

సిద్దిపేట సర్కిల్‌లో వివిధ విద్యుత్ మరియు సివిల్ పనుల కొరకు SE/OP/సిద్దిపేట యొక్క టెండర్ స్పెసిఫికేషన్ నం: T-37/25-26, T-74/25-26, T-98/25-26 (పొడిగించబడింది), T-106 to T-108/2025-26 (New) కొరకు టెండర్ ప్రకటన. బహిరంగ టెండర్ల కొరకు బిడ్స్ యొక్క విక్రయం 22.01.2026 నుండి ప్రారంభం మరియు 28.01.2026, 17.00గం. వద్ద ముగింపు. బిడ్స్ దాఖలుకు చివరి తేది: 29.01.2026, 14.00గం. వద్ద మరియు తెరచుట 29.01.2026 15.00గం. వద్ద. ఇ-టెండర్ల కొరకు బిడ్ డౌన్‌లోడింగ్ 22.01.2026 తేదీ నుండి ప్రారంభం. బిడ్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 28.01.2026, 17.00గం. వద్ద మరియు బిడ్స్ దాఖలు కొరకు చివరి తేది: 29.01.2026, 14.00గం. వద్ద మరియు తెరచుట 29.01.2026, 15.00గం. వద్ద. టెండర్ వివరాలు www.tgsouthernpower.com మరియు http://tender.telangana.gov.in లో వీక్షించవచ్చును. ఫోన్: 8712471034.
సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్: సిద్దిపేట, TGSPDCL.
DIPR.NO. 14113-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 21.01.2026



**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 21.01.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి **విశ్వభారత్ పార్టీ** అధ్యక్షులు అయిన **శ్రీమతి యస్. రమాదేవి గారు** తమ పార్టీని రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో **1) శ్రీమతి యస్. రమాదేవి గారు** అధ్యక్షురాలిగా, **2) యస్. తిరుపతిరెడ్డి గారు** ప్రధాన కార్యదర్శిగా, **3) కుమారి యస్. నమయుక్తా గారు** కోశాధికారిగా, ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము: **ఇ.నం.5-6-160/B, NTPC, కృష్ణానగర్ కాలనీ, రామగుండం, పెద్దపల్లి-505215.** సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, **మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500004** గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు **విశ్వభారత్ పార్టీ**ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/- అధ్యక్షులు
విశ్వభారత్ పార్టీ


# సంపన్న వర్గాల పైనే మోడీ ప్రేమ

## మతోన్మాద వ్యతిరేక శక్తులను కూడగడతాం

## కేరళను కాపాడుకుంటాం

## మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా




**ప్రభాతవార్త ప్రతినిధి,ఖమ్మం:** మోడీకి ఈ దేశంలో రైతులు, కార్మికుల గురించి పట్టదని ఆయన ప్రేమంతా సంపన్న వర్గాలపైనేనని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా తెలిపారు. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరిస్తున్నా కనీసం ఖండించలేని స్థితిలో భారత ప్రధాని మోడీ ఉన్నారని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ముగిసిన తర్వాత ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయని పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ప్రదర్శనను, బహిరంగ సభను విజయవంతం చేశారన్నారు. ఈ ఉత్సవాలకు వేదికగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ శాఖలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరిస్తూ అత్యంత ప్రమాదకారిగా మారుతున్నారని ఈ సమయంలో వెనుజులాకు తాము మద్దతుగా నిలుస్తున్నామన్నారు. వెనుజులాపై దాడి కేవలం ఆయిల్ సంపద కోసమేనని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయవద్దని భారత్‌పై ఒత్తిడి తీసుకు వస్తున్నా మోడీ నోరు మెదిపే సాహసం కూడా చేయలేకపోతున్నారని రాజా ఆరోపించారు. భారతదేశాన్ని నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మోడి చెబుతున్నారని కానీ దేశంలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆశ్రిత పెట్టుబడిదారి విధానంతో దేశం విచ్ఛిన్నం దిశగా ప్రయత్నిస్తుందని రాజా తెలిపారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులు శ్రామిక జనులను దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని పోరాడి సాధించుకుంటే దానిని రద్దు చేసేందుకు బిజెపి కుట్ర చేస్తుందని ఇందుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తూ సమ్మె జయప్రదానికి కృషి చేస్తుందన్నారు. గవర్నర్ల వ్యవస్థను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అనేక రాష్ట్రాల్లో గవర్నర్లు స్థానిక ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను గవర్నర్ శాసించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కె సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎబి ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణ

## బ్లైజ్ కంపెనీ ఒప్పందం,ఆర్ అండ్ డి సెంటర్ విస్తరణపై ఆసక్తి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి21:** ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఏబీ ఇన్‌బెవ్ తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 50కుపైగా దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్)-2026 సదస్సులో భాగంగా దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్‌బ్లడ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఆదాయ వృద్ధి, సామర్థ్య నిర్మాణమే కీలకమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ విధాన స్థిరత్వం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దావోస్ లో కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో అవగా హన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ సంస్థ డేటా సెంటర్ అర్టిఫిషియల్ కంప్యూటింగ్‌కు తక్కువ శక్తి వినియోగించే ఎఐ హార్డ్‌వేర్, ఫుల్‌స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో బ్లైజ్ కోఫౌండర్ సీఈఓ దినాకర్ మునగాలా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే బ్లైజ్ సంస్థ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్, ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. తమ ఆర్ అండ్ డీ సెంటర్‌ను విస్తరించే పెట్టుబడులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చలు జరిగాయి. హెల్త్‌కేర్ డయా గ్నోస్టిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి రంగాల్లో ఏఐ ద్వారా పరిష్కారాలను పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేసే అవకాశాలపై కూడా చర్చ జరిగింది.ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చి దిద్దడం, వచ్చే రెండు దశాబ్దాల్లో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యానికి అత్యంత కీలకమని అన్నారు. బ్లైజ్ సంస్థ హైదరాబాద్ ఆర్ అండ్ డీ యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలం గాణ ఏఐఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఏఐ రంగంలో పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఇది వ్యూహాత్మక కేంద్రంగా పని చేస్తుందని వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఏఐ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.


**100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాలను నిల్వచేయడానికి మరియు విక్రయించడానికి నోటీసు**

వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తేదీ 24 అక్టోబరు 2015న జారీచేసిన ఉత్తర్వు నం. 2900 (ఇ) మరియు ఆ తరువాత చేసిన సవరణ ప్రకారం, జువారీ ఫార్మ్‌హబ్ లిమిటెడ్ (జెడ్ఎఫ్‌హెచ్ఎల్) ఈ క్రింద పేర్కొనబడిన 100% నీటిలో కరిగిపోయే ఎరువుల మిశ్రమాల నిల్వ మరియు విక్రయంని తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించబోతోందనే విషయం ప్రజానీకానికి తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాము.

| | గ్రేడ్‌లు | 1 | 2 |
|---|---|---|---|
| | స్పెసిఫికేషన్/కంపోజిషన్ | ఎన్‌పికె 19:19:19 | ఎన్‌పికె 13:40:13 |
| 1 | బరువు పరంగా తేమ శాతం, గరిష్టంగా | 0.5 | 0.5 |
| 2 | బరువు పరంగా మొత్తం నత్రజని, కనీసం | 19.0 | 13.0 |
| 3 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే భాస్వరం ($P_2O_5$గా), కనీసం | 19.0 | 40.0 |
| 4 | బరువు పరంగా నీటిలో కరిగిపోయే పొటాషియం ($K_2O$గా), కనీసం | 19.0 | 13.0 |
| 5 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా సోడియం (Naclగా) శాతం, కనీసం | 0.5 | 0.5 |
| 6 | బరువు పరంగా నీటిలో కరిగిపోని పదార్థం, గరిష్టంగా | 0.5 | 0.5 |
| 7 | పొడిదనం ఆధారంగా బరువు పరంగా మొత్తం క్లోరైడ్ (Clగా), గరిష్టంగా | 1.5 | 1.5 |
| 8 | బరువు పరంగా లీడ్ (Pbగా) శాతం, గరిష్టంగా | 0.003 | 0.003 |
| 9 | బరువు పరంగా క్యాడ్మియం (Cdగా), గరిష్టంగా | 0.0025 | 0.0025 |
| 10 | బరువు పరంగా ఆర్సెనిక్ (Asగా) శాతం, గరిష్టంగా | 0.01 | 0.01 |

FarmHUB
**జువారీ ఫార్మ్‌హబ్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం: జై కిసాన్ భవన్, జువారీనగర్, గోవా - 403726, ఇండియా

వార్త

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

న-సోక్రటీస్

# కొత్త విత్తన చట్టంతో కొత్త కష్టాలు!

కొత్తగా తెచ్చిన విత్తన చట్టంలోని అంశాలుచూస్తే కొరివితో తలగోక్కున్నట్లే అనిపిస్తోంది. అంటే కోరికష్టాలు తెచ్చుకున్నట్టుగా ఉంది. అసలుసిసలు విత్తనాలకు నకిలీ విత్తనాలకు మధ్యతేడాతెలుసుకునే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. దేశంలోఎక్కడ చూసినా నకిలీవిత్తనాల వార్తలే వినిపిస్తున్నాయి. రైతులు ఎంతోమంది వాటి ప్రభావంతో వేరే దారిలేక ఆత్మహత్యలకు దిగుతున్నారు. దేశంలో 500 పైబడి ఉన్న విత్తన కంపెనీలు సాలీనా ఐదువేల కోట్ల రూపాయల విలువచేసే నకిలీ విత్తనాలను రైతులకి అంటగట్టగలుగుతున్నారు. సాధారణంగా జరిగే విత్తనాల సాగుకే బోలెడంత ఖర్చవుతుంది. తీరా ఖర్చుతడిసి మోపెడయ్యాక కానీ అవి నకిలీవని తెలియదు. అప్పుడు రైతు లబోదిబో అని గుండెలు బాదుకుంటాడు. నకిలీ విత్తనాలు తారసిల్లినపుడల్లా ఇలాంటి పరిస్థితే. ఇలాంటి విత్తనాలతో దేశవ్యాప్తంగా విత్తన వ్యాపార సంస్థలు 71వేల కోట్ల రూపాయలు మేరకు వ్యాపారం చేస్తున్నాయి. కొత్తగా రైతునుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం, ముసాయిదా విత్తన బిల్లు 2025ను ప్రవేశపెట్టింది. 1966 విత్తన చట్టాన్ని కొన్ని మార్పులు చేర్పులతో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్త విత్తన బిల్లు రూపు దిద్దుకోనుంది. అయితే ఇది ఎంతవరకు రైతుకు ఉపయోగకారిగా ఉంటుందో తెలుసుకోవడం కోసం మొన్నడిసెంబరు 11వరకు రైతుల సూచనల కోసం ప్రభుత్వం సమయం ఇచ్చింది. రైతు సంఘాలు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసాయి. కానీ ఈ బిల్లులోని అంశాల్ని పరిశీలించిన వామపక్ష రైతాంగ సంఘాలు కార్పొరేటర్‌లకు మాత్రమే అనుకూలంగా ఉన్నట్లు బహిరంగంగానే చెప్పాయి. ఈ ముసాయిదా విత్తనాల బిల్లు చట్ట రూపం దాలిస్తే అంతకు ముందున్న విత్తన చట్టాలు దాటిఉంటుంది. కొత్తగా వచ్చేచట్టం నాణ్యమైన విత్తనాలు సరఫరా మరింతగా మెరుగుపరుస్తుందని, ప్రధానంగా విత్తన వాణిజ్యంలో తీసుకోదగిన అన్ని జాగ్రత్తలు ఇందులో పొందుపరిచేందుకు ఉద్దేశించబడిన బిల్లు ఇది. సాధారణ సాగుదారులకు ఈ చట్టం పెద్దగా ఉపయోగించదని, విత్తన కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూరుస్తుందన్న అపోహల్ని తీర్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచన ఎలాఉందో తెలియాలి. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటే తప్ప వారు మారరు. విత్తనాలు వేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో కూడాప్రభుత్వాలు మీనమేషాలు లెక్క పెడుతున్నాయి. ఎవరైతే నకిలీ విత్తనాలు అంటగట్టారో వారి నుంచే పరిహారాన్ని రాబట్టే ప్రక్రియ చాలా అవసరం. విత్తనసంస్థలపై ఇటువంటి ఆర్థిక భారం పడుతుందన్న విషయం అమలులో ఉందని తెలిస్తేనే వారు రైతుల్ని ఇబ్బందుల్లోకి నెట్టరు. లేకుంటే వారి ఇష్టారాజ్యం. విత్తన విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణం లేకపోవడం కూడా ఒక లోపం. అందుకే రైతుకు అందే విత్తనాల నియంత్రణపై వ్యవసాయశాఖ అధికారులపర్యవేక్షణ ఉండడం అవసరం. నకిలీ విత్తనాల విక్రయ నేపథ్యంలో విత్తనాలు కృత్రిమ కొరతకు పాల్పడే వ్యవస్థలు, వ్యక్తులు కూడా తమ కార్యకలాపాలను వారు నిర్వహిస్తుంటారు. వాటిపై ప్రభుత్వం నిరంతరం కన్నేసిఉంచాలి. అలాంటి కంపెనీలను నిషేధించాలి. రైతులు సాంప్రదాయ పద్ధతిలో విత్తనాలుపోసుకునే రైతుకు కూడామరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వటం అవసరం. అలా కాకుండా విత్తన చట్ట సవరణ పేరిట ఎన్ని చట్టాలు తెచ్చినా ఉపయోగంలేదని రైతు సంఘాల వ్యాఖ్యానం. సంయుక్త కిసాన్ మోర్చా వంటి సంస్థలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బహుళజాతి కార్పొరేట్ విత్తన సంస్థలకు మాత్రమే ఈ బిల్లు మేలుచేస్తుందని ఆయా సంఘాలుఆరోపిస్తున్నాయి. రేపటి బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఈ బిల్లు చట్ట రూపం దాల్చేందుకు ఎన్ని అభ్యంతరాలువ్యక్తమవుతాయో చూడాలి. ఈ ముసాయిదా చట్టం సాంప్రదాయవ్యవసాయ పద్ధతులకు ముప్పు కలిగిస్తుందని, అంతేకాక రైతుల విత్తనాల కోసం ప్రైవేటు కంపెనీలపై ఆధారపడాల్సివస్తే భవిష్యత్తులో స్వయంగా విత్తనాలను తయారుచేసుకునే వారి హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆల్ ఇండియాకిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే అభిప్రాయపడుతున్నారు. తదుపరి పంట కోసం విత్తనాలు నిల్వచేసుకునే సాంప్రదాయాన్ని పంజాబ్ రైతులు పాటిస్తుంటారు. రేపేపుడోవిత్తన హక్కులను కార్పొరేట్లకు ధారపోస్తే రైతు బాగా నలిగిపోతాడని పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాల్లో పరీక్షించి విడుదల చేసే ఏవిత్తన రకమైనా రాష్ట్రానికిగల ప్రత్యేక వ్యవసాయ వాతావరణ పరిస్థితుల్లో తప్పనిసరిగా వాడవలసివస్తే రైతుకు నష్టం కలుగుతుంది. అందుకే ఇది న్యాయపరమైన విత్తనచట్టం కాదని రైతు సంఘాలు ఘోషిస్తున్నాయి. రైతులకు చట్టబద్ధమైన పరిహారవ్యవస్థను రూపొందించాలని వారుకోరుతున్నారు. ఎన్నిసార్లు వ్యవసాయ చట్టాల సంస్కరణలకు తలపెట్టిన బిల్లులు రైతుల అభ్యంతరాలతో చట్టాలుగా రూపు దిద్దుకోలేదు. 1966 విత్తన చట్టం, అటుపై 1983 లో వచ్చిన విత్తన సవరణ కూడా అదే మాదిరి ఆగిపోయింది. ఈసారి పరిస్థితి అలాగే ఉంది. పెద్ద పెద్ద విత్తన కంపెనీలకే కొత్త విత్తన చట్టంకాపు కాస్తుందనీ, తక్షణ పరిహార లబ్ధిదొరకని చిన్నరైతు మరింత చితికిపోతాడని రైతు సంఘాల ఆలోచనగా ఉంది. ఏ విత్తనచట్టంలోనైనా నకిలీ విత్తనాలతో నష్టపడిన రైతుకు తక్షణ పరిష్కారం దక్కే మార్గాన్ని సూచించమని రైతు సంఘాలు అభ్యర్థిస్తున్నాయి. ప్రస్తుత బిల్లు వలన విత్తన రంగాన్ని కార్పొరేట్‌లు హస్తగతం చేసుకుంటాయని సంయుక్త కిషన్ మోర్చా ఈ ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతోంది.

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు. బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.



జార్జి ఎలియట్

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

# ప్రజావాక్కు



## పెరుగుతున్న డయాబెటిస్ బాధితులు

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక డయాబెటిస్ బాధితులున్న రెండో దేశంగా భారత్ నిలవడం ఒక తీవ్రమైన ప్రజారోగ్యసంక్షోభానికి నిదర్శనం. వేగవంతమైన పట్టణీకరణ, జీవనశైలి మార్పులు జన్యుపరమైన ముప్పులు ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు కేవలం సంపన్నవర్గాలకే పరిమితమైన ఈ వ్యాధి, ఇప్పుడు గ్రామీణప్రాంతాలకు, యువతకు సైతం వేగంగా విస్తరిస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేఆహారం, మానసిక ఒత్తిడి, అస్తవ్యస్తమైన నిద్రఅలవాట్లు ఈ మెటబాలిక్ వ్యాధికి ఇంధనంగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తు, చాలా సందర్భాల్లో ఈ వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## శాంతి ముసుగులో అధికారం

గ్రీన్‌లాండ్‌ను ప్రపంచభద్రతకుఅనివార్యమని ప్రకటిస్తూ, నోబెల్ శాంతి బహుమతి ప్రస్తావనను కూడా జోడించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, శాంతి కంటే శక్తి ప్రదర్శనకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న రాజకీయ ధోరణిని బహిర్గతం చేస్తున్నాయి. ఇవి దౌత్యబద్ధమైన విదేశాంగవిధానానికి నిదర్శనం కాకుండా, అంతర్జాతీయవ్యవస్థను వ్యక్తిగత రాజకీయఅహంకారానికి లోబర్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో గ్రీన్‌లాండ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. కానీ ఆ ప్రాముఖ్యతను సాకుగా చూపి, ప్రపంచ భద్రత పేరుతో భూభాగాలపై హక్కులు ప్రకటించడం వలసవాద ఆలోచనలకు ఆధునిక రూపం ఇచ్చినట్లే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## వీధి కుక్కలను కట్టడి చేయాలి

ఆధునిక మానవుని జీవన విధానం మారింది. పల్లెల్లో ఉండడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. పల్లెటూరి జీవన విధానం పూర్తిగా కనుమరుగైపోతూఉన్నది. పల్లెటూర్లలో వీధి కుక్కలుండేవి. వాటిని విచ్చలవిడిగా వదిలేసేవారు. వ్యవసాయానికి పనికివచ్చిన పశువులను సాలల్లో కట్టేవారు. ఇప్పుడు పట్టణాల్లో ఖరీదైన కుక్కలను కొన్వెక్కి అద్దెలలో ఉన్నవారు కూడా బీరువాలో పదివేల నోట్ల కట్ట లేని వారు కూడా కొంటున్నారు. సోమలి కాపులు కాస్త కుక్కల కాపులుగా మారిపోయారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## మూడో ప్రపంచ యుద్ధం!

ఒకరి దగ్గర ఉన్న డబ్బును ఇంకోకరికి ఎంతైనా ఇవ్వవచ్చును. దీనికి ఎవరి అనుమతి తీసుకోనక్కరలేదు. ఇదేమి విచిత్రమో వెనుజూలా ప్రతిపక్షనాయకురాలైన మరియామదుడో 2025 లో తనకొచ్చిన నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రేమ పూర్వకంగా ఐచ్ఛికంగా ఇచ్చివేసింది. దానికి ట్రంప్ ఆనందపడుతూ స్వీకరించడం వింతల్లో కెల్లా వింత. ఇతరదేశాలన్ని దీన్నిచూసి నవ్వుకున్నాయి. నోబెల్ బహుమతి ప్రదాతలయిన నార్వే దేశం వారు దీన్ని ఖండించారు. ఒకరు సంపాదించుకున్న డిగ్రీలు, మెడల్స్ ఒకరి నుంచి మరొకరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యే సరకుకాదు. ఎనిమిది యుద్ధాలను ఆపిన తనకు శాంతి బహుమతి రాలేదు కాబట్టి ఇక తాననుకున్న పరిపాలనే చేస్తానని ట్రంప్‌చెప్పుకోవడం హాస్యాస్పదం. అంటే ప్రపంచ శాంతికి ఏదో విధంగా విఘాతం కలిగించే పనులు చేస్తాడనే అర్థం అవుతోందిగా.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

## పోలీసు వ్యవస్థలో మార్పులు

తెలంగాణ పోలీస్‌వ్యవస్థలో ఈ మార్పును అభినందించవచ్చును. పోలీస్ వ్యవస్థలో కొద్దిపాటి మార్పు తీసుకొచ్చినందులకు అభినందించవచ్చును. అట్లాగే పోలీస్ వ్యవస్థలో రాజకీయ జోక్యంలేకుండా పోలీస్‌వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి బాధితులకు మరింత చేరువగా మానవీయ కోణంలో సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధన విభాగం సీఐడి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇది పౌరులకు బాధితులకు శుభ పరిణామంగా భావిస్తున్నారు. ఇకపై బాధితులు ఠాణాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేకుండా పోలీసులే బాధితుల నివాసానికి లేదా వారు కోరిన ప్రదేశానికి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. నమోదుచేసే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

## పండ్ల పెంపకం చేపట్టాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు వల్ల తేమకూడా పెరిగింది. దాని వల్ల కొబ్బరి లాంటి తోటలు కూడా పెరిగే అవకాశం ఉండడంతో తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలి. ఉపాధి హామీ ప్లానింగ్ చేసేటప్పుడు పండ్ల తోటల పెంపకాన్ని ఒక ప్రాధాన్యాన్ని ఇవ్వాలి. గేట్ల వెంబడి నాటితే రైతులకు ఏ నష్టం కూడా వాటిల్లదు. అందుకని తెలంగాణలో పండ్ల పెంపకం చేపట్టడం వల్ల ఎటువంటి నష్టం ఉండదు.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యను ప్రైవేట్‌పరం చేయడం న్యాయమా?

**అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటినీ, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది.**



రావులపాటి సీతారాం రావు

గతకాలం వైభవం చెప్పుకోవటం అప్రస్తుతమేమో కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఉన్నత తరగతుల విద్యాభ్యాసం తోపాటు క్రింది తరగతుల విద్యార్థుల చదువులను గురించి సమీక్షిస్తే చాలా లోపాలు, కొట్టొచ్చినట్లు కనబడుతాయి. పూర్వకాలంలోని గురుకులాలలోని విద్యాభ్యాసం ఆచరించాల్సిన అవసరం ఈ మధ్యకాలంలో మళ్లీ ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవటం గమనిస్తూనే ఉన్నాం. అయితే ఆనాటి గురుకులాల్లోని విద్యార్థుల సంఖ్య చాలా పరిమితులకు లోబడి ఉండేది. ఈనాడు విద్యతో ఉద్యోగం ముడిపడి ఉండటం చేత ఇబ్బడిముబ్బడిగా సంఖ్య విద్యాలయాల్లో పెరుగుతున్నది. చదువుకున్న విద్యార్థుల నాణ్యత తగ్గుతున్నది. పుస్తకాల బరువు పెరుగుతున్నది. సంపాదించుకున్న విజ్ఞానం అరకొరగా ఉంటున్నది. చివరకు విద్యార్థులు విద్యగరిపే అధ్యాపకుల విషయాలు, విశ్వవిద్యాలయాల నాణ్యత తగ్గుముఖం పట్టడం, ఎక్కువ మంది విద్యార్థుల ఆత్మహత్యలూ ఇలాంటి విషయాల్లో కూడా కోర్టులు దృష్టి పెట్టి ఆదేశాలు ఇవ్వాల్సిన పరిస్థితులు రాష్ట్రాల్లో ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో సుప్రీంకోర్టు తొమ్మిది ఆదేశాలు రాష్ట్రాలకూ, కేంద్రానికి ఇవ్వటం ఇటీవల విద్యార్థులనూ, విద్యాధికులనూ, విద్యాలయాలనూ ఆలోచింపచేసే విషయంగా మారింది. ఎక్కువగా విద్యాసంస్థలు ప్రభుత్వం నుంచి ప్రైవేట్‌పరం అవటంతో ఈ ప్రైవేట్ సంస్థలు ఆర్థిక కారణాలతో 'మాస్' లెవల్లో వివిధ తరగతుల్లో చేర్చుకొనే దుస్థితి దాపురించింది. ఎక్కువ సంఖ్యలో ఒక క్లాసులో విద్యార్థులుంటే, ఎంతవరకు అందరికీ సమస్థాయిలో విద్యగరపటం ఎంత కష్టమో ఈ విద్యాసంస్థలు పట్టించుకోకపోగా, మెరుగైన విద్యార్థులను గుర్తించి వారినే ప్రోత్సహించటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. 'సెలెక్టెడ్ విద్యాదానం' కొన్ని సంస్థలు, పేర్లు అందరికీ తెలుసు. ప్రస్తావించడం అప్రస్తుతం. విద్యార్థులు కాకుండా ఆర్థికార్థులు ఈ ప్రోత్సాహాలకు కారణంగా కనపడుతున్నాయి. ఈమధ్యకాలంలో అందుకనే కొన్నిప్రభుత్వాలు, విద్యాసంస్థలను మెరుగ్గా తీర్చిదిద్ది విద్యార్థుల భవిష్యత్తు సమదృష్టితో బేరీజు వేసి, ప్రోత్సహించాలని, నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఆచరణలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటేనే ఇలాంటి ప్రయత్నాలు విజయాలను సాధించగలవు. సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకనిర్దేశాలలో ఈ విషయం ప్రస్తావించారు. సుప్రీంకోర్టు, ఉన్నత విద్యలు, ప్రైవేట్‌పరం కావటంతో క్వాలిటీ తగ్గి క్వాంటిటీ పెరగటాన్ని గమనించింది. ఆర్థిక ప్రయోజనం కోసమే అన్న అంశాన్ని కూడా ఇందుకు కారణంగా పరోక్షంగా చూపెట్టింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 142 ప్రస్తావించి, మార్గదర్శక సూత్రాలలో రికార్డులు



భద్రపర్చటం, రిపోర్టింగ్ కాకుండా ఆత్మహత్యలు ఉన్నత విద్య చదివే వారిలో ఎందుకు పెరుగుతున్నాయన్న సమీక్ష, (అంటే హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్లలో) ప్రత్యేకంగా చేయాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగా తగు నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్స్ రిజిస్ట్రార్ల వెకెన్సీలు త్వరగా భర్తీ చేయాలని స్పష్టపరిచింది. అదే విధంగా ఫ్యాకల్టీ ఖాళీలను భర్తీ చేయక తప్పదని కూడా ఈ ఆదేశాలలో చేర్చింది. విద్యార్థుల బాగోగులు ఈ ఆదేశాల అమలుపై ఆధారపడి ఉన్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు భారత దేశంలో, ప్రస్తుత లెక్కల ప్రకారం దాదాపు 50 శాతం ఉన్నత విద్యాసంస్థలలో (హెచ్.ఇ.ఐ) ముఖ్యంగా విశ్వ విద్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయని వేలెత్తి చూపింది. తమిళనాడులోని మద్రాసు యూనివర్సిటీని ఒక 'కేసు స్టడీ'గా భావించి ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ విశ్వవిద్యాలయానికి ముఖ్యంగా మహిళల విద్య విషయంలో దేశంలోనే ప్రముఖస్థానం ఉంది. క్వాలిటీ రిసెర్చికి ఈయూనివర్సిటీకి మంచి పేరు ఉంది. 1970 సంవత్సరంలో చదువు చెప్పేవిషయంలో ఈ సంస్థకు పెద్ద పేరు ఉండేది. తర్వాత ఆ పేరు క్రమేపీ తగ్గిపోయి యూనివర్సిటీ ప్రత్యేకతను కోల్పోయింది. అవసరమున్న టీచింగ్ స్టాఫ్ సంఖ్యలో సగం సంఖ్య మాత్రమే ఉండటం ఇందుకు ఒక కారణంగా చెప్పక తప్పదు. రీసెర్చి భాగం నామమాత్రంగా ఉంది. ఇంతకు ముందు ఫిలాసఫీ, మాథ్స్, బాటనీ సబ్జెక్ట్‌లో ఈ యూనివర్సిటీకి గర్వపడేంత గొప్ప పేరు ఉండేది. కానీ ఇప్పుడు ఆ పేరు ఛాయామాత్రంగానే మిగిలింది. ఈ యూనివర్సిటీ ప్రస్తావన ఎందుకంటే మనదేశంలో ఒకప్పటి ఉన్నత విద్య ఎంత ఉన్నతంగా ఉండేదో చెప్పటానికి మాత్రమే గవర్నర్లు ప్రభుత్వాలు పంపిన వైస్ ఛాన్సలర్ల నియామకాలను ఏదో ఒక వంకతో ప్రక్కన పెట్టటంతో వెకెన్సీలు భర్తీ చేయకపోవటంలో ఇలాంటి పరిస్థితి దాదాపు అన్నిరాష్ట్రాలలోవచ్చింది. ప్రభుత్వాలు తమకు రాజకీయంగా అనుకూలురు అయిన వారి పేర్లను పంపటం కూడా ఒక కారణం కావచ్చు. అవినీతి, పవిత్రంగా ఉంచాల్సిన విద్యాసంస్థలలో పెరగటం మరొక ముఖ్య కారణంగా భావించక తప్పదు. వీటన్నిటినీ, విద్యాసంస్థలు సరిచేయడానికి 4 నెలల గడువు సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా ఇచ్చింది. కానీ అది జరిగే పనికాదని అందరికీ తెలుసు. విద్యార్థుల ఇష్టాలను బట్టి వారు ఏ కోర్సు తీసుకోవాలో వారికే ఒదిలేయాలి. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలనే తల్లిదండ్రుల ప్రగాఢమైన కోరికతోపాటు విద్యాసంస్థల ప్రైవేటేజేషన్ వల్ల విద్యకు సముచితస్థానం ఇవ్వలేకపోవడం ఈ దేశంలో దురదృష్టంగా దాపురించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రైట్ టు లైఫ్ విద్యతోపాటు ఆరోగ్యాన్ని, సామాజికపరంగా, ప్రభుత్వపరంగా పౌరులకు కల్పించినప్పుడే నిజమైన అర్థం ఉన్నట్లు అవుతుంది. ఆ బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలది. న్యాయ స్థానాలు ఈ విషయంలో కల్పించుకుంటున్నాయంటే ప్రభుత్వాలు విఫలమైనట్లే అని అర్థం అవుతున్నది.

# ఆన్‌లైన్ మోసాలతో జర జాగ్రత్త!

డా.పోలం సైదులు

సోషల్ మీడియాను వేదికగా చేసుకోని వర్క్‌ఫ్రమ్ హోమ్, పార్ట్‌టైం జాబ్, ఫిషింగ్, ఫేక్ కస్టమర్ కేర్, ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్, లోన్‌యాప్‌లు, జాబ్, వీసా, గిఫ్ట్, లాటరీలంటూ మోసాలు, ఓఎల్ఎక్స్, క్వికర్, ఇతర మార్కెటింగ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్, మ్యాట్రిమోనల్ లాంటి రకరకాల పేర్లతో సైబర్ నేరాలు చోటుచేసు కుంటూ డేటా చౌర్యానికి పాల్పడుతున్నాయి. ఆశకుపోయి కొంచెం ఆదామరిస్తేచాలు ఉన్నది పోగొట్టుకుని, అప్పులపాలై చిక్కుల్లో పడాల్సిందే. మొన్నీమధ్య వాట్సాప్‌లలో ఒక మెసేజ్ చక్కర్లు కొట్టడం అందరికీ తెలిసిందే. కంగ్రాట్యూలేషన్స్ మీరు గిఫ్ట్ గెలుచుకున్నారు. క్లయిమ్ చేసుకోండని మెసేజ్ దర్శనమివ్వడం, దానిని తాకగానే మరో పది గ్రూపు లకు పంపాలని, అలా చేసినవారి ఫోన్లలో వాట్సాప్ హ్యాక్ అయ్యి ఆ నంబర్ నుండి కాంటాక్ట్ నంబర్లకు మెసేజస్ వెళ్లడం జరిగింది. వర్క్‌ఫ్రమ్‌హోమ్ జాబులంటూ నెల జీతాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చి, రిజిస్ట్రేషన్ ఖర్చులను ముందు గానే జమచేయాలంటూ కండిషన్ పెడుతూ, తీరా చేశాక తీసుకోని ఉడాయించడం జరుగుతుంది. డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని మోసపూరిత మాటలు చెబుతూ, మొదట్లో నమ్మకం కలిగాక పెద్దమొత్తం వసూలుచేసి వారిని ఇబ్బందులకు గురిచేయడం, కేవలం బెట్టింగ్ కోసమే వివిధరకాల ఆటలు ఆడిస్తూ, క్షణక్షణానికి బెట్టింగ్స్‌పెట్టి డబ్బులు కాజేయడం, పిల్లలను రకరకాల ఆటలకు అలవాటుపడేలా చేసి తర్వాత వారినుండి అధిక మొత్తంలో డబ్బులు కాజేయడం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందడంతో చౌకగా ఇంటర్నెట్ అందరికి అందు బాటులోకి వచ్చి ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తూనే, ఏం జరుగుతుందో, ఎలా జరుగుతుందో, చివరికి ఏమోతుందోనన్న అనుమానం కలిగిస్తూ సగటుమానవున్ని కలవర పెడుతుండడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ప్రస్తుతం మనుషులు పేపర్‌కరెన్సీ లేకుండా లావాదేవీలు జరుపుతున్నారు. అన్ని రకాల బ్యాంకులు వారి బ్యాంకులకు సంబంధించి ప్రత్యేక యాప్‌లను డెవెలప్‌చేసి తమ కస్టమర్లకు అందుబాటులో తెచ్చి, ఫోన్ పే, గూగుల్ పే, పేటియం, ఆన్లైన్ పేమెంట్లకు యాక్సెస్ ఇవ్వడంతో, సాంకేతిక పరిజ్ఞానమునుపయోగించుకొని కొందరు సులభంగా డిజిటల్ నేరాలకు పాల్పడటం జరుగుతుంది. ఎవరైనా తమ ఫోన్‌లోకి ఒక యాప్‌ని డౌన్లోడ్ చేసుకోని ఉపయోగించాలంటే తన వ్యక్తిగత వివ రాలను ఇవ్వాల్సివుంటుంది. అంటే తనకు తెలియకుండానే తన సమాచారం ఇతరులకు చేరుతుంది. ఇలా షరతులు, దేశంలో



ఇలాంటి విషయాలు తెలియకుండా ఇంటర్నెట్ వినియోగిస్తూ లావాదేవీలు జరుపుతూ మోసపోతున్నవారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. సర్వేఆధారంగా వన్ టైం పాస్వర్డ్‌ను తమకు తెలియకుండా ఇతరులతో పంచుకున్న వారు 26శాతం వున్నారంటేనే అవగతమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోని నేరాలకు దిగుతున్న సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాలను ఎంచుకోని వ్యక్తుల బ్యాంకు ఖాతా నంబర్, పాస్వర్డ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఓటిపినీ పొంది డబ్బులను కాజేస్తున్నారు. మరీ ముఖ్యమైన ఆసక్తికర విషయమేమిటంటే తాము మోసపోయిన విషయాన్నీ అంగీ కరిస్తున్నవారు అధికసంఖ్యలో వున్నారంటే దేశంలో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న డిజిటల్ నిరక్షరాస్యులెందరో తెలియకనే తెలుస్తుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమే మిటంటే డిజిటల్ నిరక్షరాస్యుడు అంటే చదువురానివాడు కాదు. చదువొచ్చినా సాంకేతిక పరిజ్ఞానంలోని లొసుగులు తెలియవనివారని అర్థం. ఎంతో చదువు చదివి వివిధరకాల ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినవారున్నారంటే ఎలాంటి ఆశ్చర్యం అక్కర్లేదు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఉద్యోగి నెలజీతం బ్యాంకుల ద్వారానే తీసుకునే పరిస్థితి, వ్యవసాయదారులుక్రాప్‌లోన్స్, ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బును బ్యాంకుల ద్వారానే తీసుకోవాలి. అలాగే మహిళామండలి సభ్యులు ప్రతినెల వారు కొంతసొమ్మును బ్యాంకులలో జమచేసుకోవడం, నెలసరి వాయిదాపద్ధతిలో కట్టి తేర్చడానికి అప్పులుగా తీసుకోవడం అందరికి తెలిసినదే. అంటే ఇప్పుడు దేశంలో బ్యాంకులలో అకౌంట్ లేకుండా ఉన్నవారెవరైనా ఉన్నారంటే ఏదో చిన్నపిల్లలు మాత్రమే వుంటారు. ఏ బ్యాంకులోనైనా ఖాతా తెరవాలంటే తమ ఆధార్ కార్డు, పాన్‌కార్డు సమర్పించాల్సిందే. ఎటిఎం కార్డు, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు పొందాలంటే ఆధార్ తప్పనిసరి అయిపోయింది. సాంకేతిక విద్యనభ్యసించిన కొందరు తమ జ్ఞానానిఉపయోగించి సుల భంగా డబ్బులు సంపాదించాలని వివిధరకాల సైట్‌లనుప యోగించి అవతలి వ్యక్తుల సమాచారాలను తెలుసుకొని మో సాలకు పాల్పడుతున్నారు. దేశంలో రోజురోజుకు అభివృద్ధి లో భాగంగా పరిణితి చెందుతూ నూతన సాంకేతిక తను పరిచయం చేస్తున్నా, అంతేవేగంతో నేరగాళ్లు సైతం వారి ఆలోచనలతో కొత్త కొత్త ఆవిష్కరణలు గావించి సైబర్ నేర గాళ్లకు ఒడిగడుతున్నారని చెప్పవచ్చు. అందుకే దేశంలోఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవడం, ఆన్‌లైన్ మోసాలు, హ్యాకింగ్, డేటా దొంగతనం వంటి ఫిర్యాదులను స్వీకరించి, సైబర్‌దాడుల నుండి ప్రజలను, సంస్థలను రక్షించడానికి అవగాహన కల్పిస్తూ, భద్రతా చర్యలనుసూచించడం జరుగుతుంది. అలాగే ఐపి అడ్రస్‌లు, ఇతర సాంకేతిక ఆధా రాల సహాయంతో సైబర్ నేరస్తులను ట్రాక్‌చేసి పట్టుకోవ డం, నేరాలకు సంబంధించిన డిజిటల్ ఆధారాలనుసేకరించి, విశ్లేషించి శిక్షపడేలా చేస్తుంది. కావున ఎవరైనా ఏదైనాసైబర్ నేరానికి గురైతే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చు లేదా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదుచేయవచ్చు. ప్రభుత్వంసైతం నేరాలపై వివిధ సర్వేల ఫలితాలను పరిశీలించి, సైబర్ నేర గాళ్ల ముప్పునుండి తప్పించుటకు, సాంకేతిక నిపుణలతో చర్చించి, ఇలాంటి నేరాలకు ఎవరు పాల్పడినా వెంటనేగుర్తించి, వారికి కఠినమైన శిక్షలు వేసేవిధంగా కృషి చేయాలి.

# సంకుచిత పోకడలు ప్రమాదకరం

ఐ.ప్రసాదరావు

ప్రాచీన కాలంలో ప్రపంచంలో బహుగా ప్రకాశించిన పర్షియా దేశం తదుపరి మతం ఆధార దేశంగా ఇరాన్ పేరుతో మారిపోయి, నేడు అతి దీన దేశంగా, అన్ని రంగాల్లో విఫలమై విలవిలలాడుతున్న అతిపేద దేశంగా ప్రస్తుతం మన కళ్లముందు కదలాడుతుంది. దీనికి ప్రధాన కారణం మతపరమైన కట్టుబాట్లు ఆచారాలు, పరిపాలన అభివృద్ధికి ఆటంకంగా ముఖ్యంగా మహిళలు అభివృద్ధికి గొడ్డలి పెట్టు అవుతున్న తరుణంలో ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆందోళనలతో అట్టుడుకుతూ, ఇతర దేశాల ఆధిపత్యం వహించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఆధునిక కాలంలో ప్రపంచం మొత్తం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక టెక్నాలజీతో దూసుకుపోతున్న తరుణంలో సహజవనరుల చమురు నిల్వలు ఉన్న ఇరాన్ దేశం సుభిక్షంగా ఉండవలసింది పోయి, తీవ్రమైన సంక్షోభంలో పడటానికి ప్రధాన కారణం మత ఆధారిత పరిపాలన అనే గ్రహించాలి. ప్రపంచ వ్యాప్తంగా రాజరికం, మత ప్రభువులు పాలన, నియంతల పాలన పోయి, దాదాపు ప్రపంచంలోని మూడోవంతు దేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సాగుతున్న దేశాలు ఏవిధంగా అభివృద్ధి పంథాలో సాగుతున్నాయో గుర్తెరగాలి. మత ఆధారంగా మన నుంచి విడిపోయిన మన పొరుగు దేశమైన పాకిస్థాన్ కూడా దాదాపు అన్ని రంగాల్లో దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నది. అంతేకాకుండా అసాంఘిక శక్తులకు ఆస్థానంగా మారింది. పాలన మత ఆధారంగా మారిపోతే, అభివృద్ధి ఆగిపోయి, ఈ ఆధునిక కాలంలో అధోగతి పాలు అవుతుంది అని చరిత్ర చెబుతోంది. ఏ దేశంలోనైనా అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మత ఆధారంగా ఉన్న దేశాల పాలనలో మహిళలకు తగిన ప్రాధాన్యత లేకపోవడం అంతేకాకుండా అణచి వేయడానికి ప్రయత్నాలు చేస్తుండటంతో ఆయా దేశాల్లో అశాంతి, ఆగ్రహావేశాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. మానవ హక్కులు మంటగలసి అభివృద్ధిలో కుంటుపడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు నేతలను ఉపేక్షించడం మంచిది కాదు. గత సంవత్సరం వరకు అనేక రంగాల్లో అభివృద్ధి చెందిన మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్ నేడు పరిపాలనలో మత ఆధారిత ప్రభావం పెరగడంతో దేశం అతలాకుతలం అవుతోంది. పరిస్థితి చేజారకముందే చర్యలు తీసుకోవడం ఉత్తమం అని గ్రహించాలి. అలాగే ఆఫ్ఘనిస్తాన్ కూడా మత ఆధారిత పరిపాలన వల్ల అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న పరిస్థితి. నేటి ఆధునిక



కాలంలో ఏ దేశంలోనైనా మత, కుల, లింగ, ప్రాంతీయ, భాష, రంగు, ఆధిపత్యం వంటి విషయాలు ఆధారంగా పరిపాలన సాగితే, తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని అన్ని దేశాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు. ఇక ఇటీవల కాలంలో మన దేశంలో కూడా 'ఒకే' అనే భావన ప్రోత్సహించడం జరుగుతుంది. భారతదేశం విశిష్ట లక్షణం 'భిన్నత్వంలో ఏకత్వం' ఈ విషయం మరచి పోయి నేటి పాలకులు ఒకే భాష, ఒకే మతం, ఒకే పార్టీ వంటిఅంశాలు ప్రోత్సహించడం జరుగుతుంది. ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. సరికదా భవిష్యత్తులో వివక్షత, విద్వేష, విభజన వంటి సంకుచిత ధోరణులు పెరిగి, దేశంలో అలజడులు ప్రబలే అవకాశం ఉంది అని గ్రహించాలి. తాత్కాలిక అధికారం కోసం, ఆధిపత్యం కోసం పరితపించే పాలకులు, భవిష్యత్తులో పెను ప్రమాదాలు అంచనా వేయాలి. భారత రాజ్యాంగం ఆశయాలు దృష్టిలో ఉంచుకోవాలి. నాకు అధికారం ఉందికదా అని ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విర్రవీగుతూ సామ్రాజ్యవాద ధోరణితో వివిధ దేశాలనుభయపెడుతూ ఆక్రమణకు సిద్ధం అవుతున్న తరుణంలో, తన మిత్రులు అనుకున్న యూరోపియన్ దేశాలు బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు గ్రీన్‌లాండ్ విషయంలో ఎదురు తిరుగుతున్నాయి. అనగా అతిగా ప్రవర్తిస్తే ఏ విషయంలోనైనా ఎదురుదెబ్బ తగులుతుంది అని గ్రహించాలి. క్రీ.శ ఒకటవ శతాబ్దం నుంచి నేటి వరకూ ప్రపంచం వ్యాప్తంగా అనేక ఆర్థిక సామాజిక రాజకీయ మార్పులు వచ్చాయి. అందరూ సమానమే అనే భావన పురుడు పోసుకుంది. మాగ్నా కార్టా, మానవ హక్కులు, సహజ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవత్వం, సామ్యవాదం లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి అనేక అంశాలపై నేటి ప్రభుత్వాలు పనిచేయవలసిన ఆవశ్యకత ఉంది. ఇవి అన్ని దేశాలు గుర్తించాలి. మన దేశ పాలకులు కూడా ముఖ్యంగా రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా పరిపాలన అందించాలి. అధికారం అందిపుచ్చుకోవడానికి అడ్డదారులు తొక్కరాదు. ఆయా రాష్ట్రాల్లో సున్నితమైన అంశాలను రెచ్చగొట్టి, ఓట్లు దండుకోవడం మంచిది కాదు. ఆయా రాష్ట్రాల్లో పరిపాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపి, ప్రజలను చైతన్యవంతం చేసి మరింత మెరుగైన పరిపాలన అందిస్తాం అనే భరోసా కల్పించాలి. ఓట్లు రాబట్టుకోవడం మంచిది. అంతేకాకుండా కుల, మత, భాష ఆధారంగా ఓట్లు దండుకోవడం మంచిది కాదు. ఏది ఏమైనా ప్రస్తుత ప్రపంచంలో అధికారం, ఆధిపత్యం ధోరణులు పెరుగుతున్నప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఐక్యమత్యంతో సంఘటితంగా ఉండాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే వారిని బలపరచాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా పరిపాలన అందించడంలోనే భవిష్యత్తు ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది అని అందరూ ముఖ్యంగా పాలకులు గ్రహించాలి. మీడియా కూడా కీలక పాత్ర పోషించాలి.

# అటల్ పెన్షన్ యోజన మరో ఐదేళ్లు

## కోట్ల మందికి భరోసా ఇస్తూ కేంద్రం కీలక నిర్ణయం

## సిడ్బీకి రూ.5 వేల ఈక్విటీ మద్దతుకు కేబినెట్ ఓకే

**న్యూఢిల్లీ, జనవరి 21:** కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు, సామాన్యులకు తీపికబురు అందించింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో అటల్ పెన్షన్ యోజన పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అటల్ పెన్షన్ యోజన గడువును 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ప్రచార మరియు అభివృద్ధి కార్యకలాపాలకు నిధుల మద్దతును మరియు లోటు నిధులను కూడా పొడిగించింది. ఈ పథకం ద్వారా అసంఘటిత రంగంలోని కోట్లాది మంది కార్మికులకు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సమావేశం తర్వాత విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, అసంఘటిత కార్మికులలో అవగాహన కల్పించడం, సామర్థ్య నిర్మాణంతో సహా పథకాన్ని విస్తరించడానికి ప్రచార, అభివృద్ధి కార్యకలాపాలకు ప్రభుత్వ మద్దతుతో ఈ పథకం 2030-31 వరకు కొనసాగుతుంది. ఎపివై చందాల ఆధారంగా 60 ఏళ్ల వయస్సు నుండి నెలకు రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు హామీతో కూడిన కనీస పెన్షన్‌ను అందిస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసే వారు తమ వృద్ధాప్యంలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు 2015 మే 9న కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అటల్ పెన్షన్ యోజన ద్వారా చందాదారులు 60 ఏళ్లు నిండిన తర్వాత వారు చెల్లించిన చందాను బట్టి నెలకు రూ. 1,000 నుండి రూ. 5,000 వరకు కనీస హామీతో కూడిన పెన్షన్‌ను పొందుతారు. అటల్ పెన్షన్ యోజన పథకం ఇకపై 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. ఈ పథకం వ్యాప్తిని పెంచడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి, గ్యాప్ ఫండింగ్ కోసం కేంద్రం నిధుల మద్దతును కూడా పొడిగించింది. ఈ ఏడాది జనవరి 19 నాటికి ఈ పథకంలో సుమారు 8.66 కోట్ల మంది పైగా చందాదారులు నమోదు చేసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులకు చేరువ కావడానికి ప్రభుత్వం సామర్థ్య పెంపుదల, అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, చిరు వ్యాపారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోనున్నారు.

తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో మరిన్ని కోట్ల మందికి ఈ పథకం కింద సామాజిక భద్రత లభించనుంది.



**చిన్న పరిశ్రమలకు కేంద్రం తోడ్పాటు**

దేశంలో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బి)కి రూ.5 వేల కోట్ల ఈక్విటీ మద్దతు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.5 వేల కోట్ల ఈక్విటీ మూలధనాన్ని మూడు విడతలుగా సిడ్బి (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో పెట్టుబడిగా పెట్టనుంది. ఇందులో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3వేల కోట్లు, 2026-27లో వెయ్యి కోట్లు, 2027-28లో వెయ్యి కోట్లు చొప్పున కేంద్రం పెట్టుబడిగా పెట్టనుంది.



# భారత్‌లో ఉగ్రదాడులకు పాక్ కుట్ర!

## నిఘా వర్గాల వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 21:** పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ భారత్‌లో ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ దేశానికి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ ఉగ్రవాదులకు సహకరిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జనవరి 26న భీకర దాడులకు పాల్పడేందుకు '26-26' అరు కోడ్ నేమ్‌ను పెట్టుకున్నట్లు తెలిపాయి. గణతంత్ర వేడుకలకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో దాడులకు దిగవచ్చని తెలిపాయి. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు సరిహద్దులు సహా జమ్ము కశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పలువురు అనుమానితుల ఫొటోలతో ఢిల్లీ పోలీసులు వాంటెడ్ నోటీసులు జారీ చేశారు. వారిని ఎక్కడైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులు సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ జమ్ముకశ్మీర్, పంజాబ్, ఢిల్లీ హర్యానాలోని యువకులను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించామన్నారు.



## మొజాంబిక్ హక్కుల కార్యకర్తకు ఇందిరాగాంధీ శాంతి పురస్కారం

**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రతిష్టాత్మక ఇందిరా గాంధీ శాంతి పురస్కారానికి మొజాంబిక్ హక్కుల కార్యకర్త గ్రాకా మాచెల్ ఎంపికయ్యారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక సాధికారత, మానవతావాద పనులలో గ్రాకా మాచెల్ చేసిన విప్లవాత్మక కృషికి గుర్తింపుగా 2025 సంవత్సరానికి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఇందిరాగాంధీ మెమోరియల్ ట్రస్ట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ అధ్యక్షతన సమావేశమైన అంతర్జాతీయ జ్యూరీ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇందిరాగాంధీ శాంతి బహుమతితో పాటు రూ.కోటి నగదు, ప్రశంసాపత్రం, ట్రోఫీని మొజాంబిక్ హక్కుల కార్యకర్త గ్రాకా మాచెల్‌కు అందించనున్నారు. మాచెల్ ఒక విశిష్ట ఆఫ్రికన్ రాజనీతిజ్ఞురాలు.

# ఎన్నికల ప్రచారానికి 'కమలం' భారీ వ్యయం

## అదే దారిలో కాంగ్రెస్ పార్టీ కూడా!




**న్యూఢిల్లీ, జనవరి 21:** లోక్‌సభ ఎన్నికలు, ఇతర రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 2024-25 సంవత్సరంలో ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ రూ.3,335.36 కోట్లు ఖర్చు చేసినట్లు ఆ పార్టీ వార్షిక ఆడిట్ నివేదిక ఎన్నికల కమిషన్‌కు సమర్పించింది. 201920 సంవత్సరంలో 17వ లోక్‌సభ, ఏడు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల కోసం రూ.1,352.92 కోట్లు ఖర్చు చేసిన బీజేపీ అంతకు రెండున్నర రెట్లు అధికంగా 2024-25 (18వ లోక్‌సభ) ఎన్నికల కోసం ఖర్చు చేసింది. 2024 లోక్‌సభ ఎన్నికలను ఆ ఏడాది మార్చి 16న ఎన్నికల కమిషన్ ప్రకటించగా అంతకు ముందు ఆర్థిక సంవత్సరం నుంచే ప్రచార కార్యకలాపాలు మొదలయ్యాయి. 2024 ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 44 రోజుల పాటు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఎన్నికలకు ముందు ఆర్థిక సంవత్సరం 2023-24లో ఎన్నికలు, సొంత ప్రచారం కోసం బీజేపీ 1,754.06 కోట్లు ఖర్చు చేసింది. 18వ లోక్‌సభ ఎన్నికలు, 8 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు సంవత్సరం, ఎన్నికలు జరిగిన సంవత్సరంలో ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం బీజేపీ ఖర్చు చేసిన మొత్తం వ్యయం రూ. 5,089.42 కోట్లు. 17వ లోక్‌సభ ఎన్నికలు, 7 అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు రెండు సంవత్సరాల్లో ఖర్చు చేసిన రూ. 2,145.31 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా అధికం. 2025 డిసెంబర్ 27న ఎన్నికల కమిషన్‌కు బీజేపీ తన వార్షిక ఆడిట్ నివేదికను సమర్పించగా దాన్ని ఈసీ ఈ వారం ప్రచురించింది. 2024-25లో బీజేపీ చేసిన మొత్తం ఖర్చు రూ. 3,774.58 కోట్లలో ఎన్నికల కోసం ఖర్చు చేసింది 88 శాతమని తేలింది. ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం జరిగిన మొత్తం వ్యయంలో 68 శాతం అంటే రూ. 2,257.05 కోట్లు ప్రకటనలు, ప్రచారం కోసం బీజేపీ ఖర్చు చేసింది. ఎలక్ట్రానిక్ మీడియా కోసం అత్యధికంగా రూ.1,124.96 కోట్లు ఖర్చు చేయగా ఆ తర్వాత వరుసగా ప్రకటనల కోసం రూ.897.42 కోట్లు ఖర్చు చేసింది. అంతేగాక ఎన్నికల ప్రచారం నిమిత్తం విమానాలు, హెలికాప్టర్లలో తిరిగినందుకు రూ. 583.08 కోట్లు ఖర్చయినట్లు తన ఆడిట్ నివేదికలో పేర్కొన్నది. ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థులకు రూ. 312.90 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందచేసినట్లు కూడా బీజేపీ తన ఆడిట్ రిపోర్టులో వెల్లడించింది. మిగిలిన పార్టీల విషయానికి వస్తే 2024-25 సంవత్సరంలో ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ రూ.896.22 కోట్లు ఖర్చు చేసింది. 2023-24లో రూ. 619.67 కోట్లు ఖర్చు చేసినట్లు ఈసీకి ఇచ్చిన ఆడిట్ నివేదికలో కాంగ్రెస్ పేర్కొన్నది. బీజేపీ వార్షికాదాయం గత రెండేండ్లలో చాలా వేగంగా పెరిగింది. 2023-24లో రూ. 4.340.47 కోట్లు ఉన్న బీజేపీ మొత్తం ఆదాయం 2024-25లో రూ. 6,769.17 కోట్లకి పెరిగింది. స్వచ్ఛంద విరాళాల ద్వారా రూ. 6,124.85 కోట్లు లభించగా మిగిలిన ఆదాయం సభ్యత్వ రుసుములు, బ్యాంక్ వడ్డీ, ఇతర వనరుల ద్వారా సమకూరినట్లు వెల్లడించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత వచ్చిన మొదటి ఆర్థిక సంవత్సరం 2024-25 కావడం గమనార్హం.

## అంతర్జాతీయ రౌడీలా వ్యవహరిస్తున్న ట్రంప్

### బ్రిటన్ పార్లమెంట్‌లో ఎంపి ధ్వజం

**లండన్, జనవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై యూకే పార్లమెంట్ సభ్యుడు ఎడ్ డేవీ తీవ్రంగా మండిపడ్డారు. గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ వైఖరిని తప్పుబడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిలా కాదు అంతర్జాతీయ రౌడీలా, గ్యాంగ్ స్టర్ లా ప్రవర్తిస్తున్నాడు. తాను కోరుకున్నది ఏదైనా సరే బలప్రయోగంతో లాక్కోవాలని చూస్తున్నాడు. అమెరికా చరిత్రలోనే ట్రంప్ అత్యంత అవినీతిపరుడైన అధ్యక్షుడు అంటూ యూకే పార్లమెంట్ లో వ్యాఖ్యానించారు. ట్రంప్ అహాన్ని శాంతింపజేయాలంటే ముందుగా ఆయనకు ఖరీదైన బహుమతులు ఇవ్వాలని, ఎంతసేపూ ఆయనను పొగడాలని అన్నారు. ప్రపంచంలో అందరూ తనను పొగడాలని భావిస్తున్నాడంటూ ఎద్దేవా చేశారు. ప్రైవేట్ జెట్ ల వంటి ఖరీదైన కానుకలిస్తూ, ఆయన క్రిప్టో ఖాతాలో బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెడితే ట్రంప్ సానుకూలంగా ఉంటారని విమర్శించారు. గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవాలన్న అమెరికా ప్రయత్నాన్ని తప్పుబట్టిన దేశాలపై టారిఫ్ లు విధిస్తానంటూ ట్రంప్ చేసిన బెదిరింపులు, ఈయూ దేశాలపై ఇప్పటికే విధించిన సుంకాలను తప్పుబడుతూ డేవీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ టారిఫ్ యుద్ధంతో పలు దేశాల్లో ఆర్థిక వ్యవస్థ కుదేలై లక్షలాది మంది ఉపాధి కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయినా సరే ట్రంప్ ఇదేమీ పట్టించుకోకుండా గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవడమే తన లక్ష్యమంటూ మాట్లాడడం సరికాదని అన్నారు. ఎవరేమైనా, ఏదేమైనా తాను కోరుకున్నది తనకు దక్కాలని భావించడం రౌడీయిజమేనని మండిపడ్డారు.

## రూ.20 వేలు పెట్టుబడి పెడితే పది రెట్లు రాబడి..

### సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విడియోలు

## ఖండించిన రాజ్యసభ ఎంపి సుధామూర్తి



**తాను ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని వెల్లడి**

**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రసుతల కృత్రిమ మేధ యుగంలో సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు చాలా మంది ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. రాజ్యసభ ఎంపి సుధామూర్తి పెట్టుబడి స్కీమ్‌లను ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా దీనిపై సుధామూర్తి స్పందించారు. అవి నకిలీవని, వాటిని నమ్మొద్దని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. రూ.20 వేలు పెట్టుబడి పెడితే పదిరెట్లు రాబడి వస్తోందంటూ తాను చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు నకిలీవని సుధామూర్తి పేర్కొన్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోలను చూసి ప్రజలు మోసపోవద్దని కోరారు. వీటిని నమ్మి తనకు తెలిసినవారు డబ్బులు పోగొట్టుకున్నారని వెల్లడించారు. తాను ఎప్పుడూ ఆర్థిక పెట్టుబడుల గురించి మాట్లాడనని, ఇలాంటి హెచ్చరికలే చేశారు. అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ఆమె చెబుతున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ అయింది. అవి ఫేక్ అని, వాటిని నమ్మొద్దని ఆమె పేర్కొన్నారు.

# మోడీ సొంత రాష్ట్రంలోనూ అవినీతేనా?

## ప్రారంభోత్సవానికి ముందే కూలిపోయిన వాటర్‌ట్యాంక్



**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రధాని మోదీ సొంత రాష్ట్రం, దశాబ్దాలుగా బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్‌లో అవినీతి క్షేత్రస్థాయిలో భారీగా ఉందని ఈ ఘటన రుజువుచేస్తోంది. రూ. 21 కోట్ల ఖర్చుతో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం జరుపుకోవడానికి ముందే కుప్పకూలిపోయింది. సూరత్ జిల్లాలో 33 గ్రామాలకు రక్షిత తాగు నీరు అందించే లక్ష్యతో నిర్మించిన వాటర్ ట్యాంకు పాలకుల నేలమట్టమైంది. వాటర్ ట్యాంకు నిర్మాణంలో నాసిరకం సామగ్రి వాడి ఉంటారన్న అనుమానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి చెందిన గాయ్‌పగ్లా గ్రూపు వాటర్ సైప్లై స్కీము కింద మాండ్వి తాలూకాలోని తాడ్‌కేశ్వర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 11 లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యంతో 15 మీటర్ల ఎత్తుతో వాటర్ ట్యాంక్ నిర్మాణమైంది. ట్రయల్ రన్ నిర్వహించగా పెద్దపెట్టున శబ్దంతో వాటర్ ట్యాంక్ కూలిపోగా స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు దాదాపు 9 లక్షల లీటర్ల నీటితో ట్యాంకును నింపినట్లు అధికారులు చెప్పారు. హఠాత్తుగా మొత్తం కట్టడం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ సహా ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. వాటర్ ట్యాంకుకు ప్రారంభోత్సవం కాకపోవడం, నివాస గృహాలకు మంచినీటి సరఫరా కనెక్షన్ ఇవ్వకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఎన్డీయేలో చేరిన టిటివి దినకరన్



**చెన్నై, జనవరి 21:** తమిళనాడులో బిజెపికి భారీ ప్రయోజనం లభించింది. ఎన్డీఏ నుంచి బయటికి వెళ్లిన అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఎఎంఎంకె) ఘర్ వాపసీ అయింది. ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ స్వయంగా ఎన్డీఏలో చేరినట్లు ప్రకటించారు. కొద్దిసేపటి కిందటే ఆయన కేంద్రమంత్రి పియూష్ గోయెల్ ను కలిశారు. ఎన్డీఏలోకి రీఎంట్రి ఇచ్చారు. అంంతకుముందు చెన్నైలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంకేను ఓడించి రాష్ట్రంలో స్థిరమైన పాలనను అందించడమే తన ఉద్దేశమని, రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ఒకే జెండా కిందికి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్డీఏలోకి తిరిగి రావడాన్ని కొత్త ఆరంభంగా దినకరన్ అభివర్ణించారు. రాజకీయాల్లో రాజీ అనేది తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. రాజీ పడటంలో తప్పులేదని, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్డీఏ కూటమికి తనవంతు సహాయం అందిస్తానని ఉద్ఘాటించారు. ఎక్కడా ఉన్నా, ఏ పార్టీలో ఉన్నా అమ్మ జయలలిత నిజమైన అనుచరులుగా తామందరం కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దినకరన్ ఎన్డీఏలో కొనసాగారు.

# అవి విద్వేష వ్యాఖ్యలే..

## ఉదయనిధి మారన్‌కు మద్రాస్ హైకోర్టు షాక్



**చెన్నై, జనవరి 21:** డెంగ్యూ, దోమలు, మలేరియా, కరోనా ఇలా కొన్నింటిని మనం వ్యతిరేకిస్తే సరిపోదని సమూలంగా నిర్మూలించాలంటూ సనాతన ధర్మంపై గతంలో చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కు హైకోర్టు షాక్ ఇచ్చింది. విచారణ జరిపిన మద్రాస్ హైకోరు ఈ వ్యాఖ్యలు విద్వేష ప్రసంగాల్లో భాగమేనని తేల్చిచెప్పేసింది. ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. 2023లో ఉదయనిధి సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పలు చోట్ల అభ్యంతరాలు వ్యక్తం అయి కోర్టుల్లో పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ క్రమంలో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ లోనూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇవాళ వాటిని విద్వేష వ్యాఖ్యలుగానే తేల్చింది. డీఎంకే 100 ఏళ్లకు పైగా హిందూ మతంపై స్పష్టమైన దాడి చేస్తోందని, మంత్రి అదే సైద్ధాంతిక వంశానికి చెందినవారని గుర్తుచేసింది. మరోవైపు విద్వేష ప్రసంగాలు చేసిన వారు బాగానే ఉంటారని, వాటిపై స్పందించిన వారే చట్టపరంగా ఇబ్బందులు పడుతున్నారంటూ హైకోర్టు బెంచ్ వ్యాఖ్యానించింది. కోర్టులు కూడా విద్వేష ప్రసంగాలపై స్పందించిన వారిని ప్రశ్నిస్తున్నాయి, వాటిని ప్రారంభించిన వ్యక్తులపై చట్టాన్ని అమలు చేయడం లేదని, తమిళనాడులో మంత్రి చేసిన ద్వేషపూరిత ప్రసంగానికి సంబంధించి ఎటువంటి కేసు నమోదు కాలేదని హైకోర్టు గుర్తుచేసింది.

## పూరీ జగన్నాథ ఆలయానికి బాంబు బెదరింపు

**పూరి, జనవరి 21:** ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయాన్ని పేల్చివేస్తామని సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆన్‌లైన్ పోస్టు ఆధారంగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందురోజు ఫేస్‌బుక్‌లో ఆ పోస్టు కనిపించింది. ఆలయాన్ని పేల్చడంతో పాటు బీజేడీ రాజ్యసభ ఎంపీ సుభాషిస్ కుంతియాను అటాక్ చేస్తామని కూడా ఆ పోస్టులో హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా పేల్చివేస్తామన్నారు. అయితే ఆ సోషల్ మీడియా పోస్టు కోసం ఓ మహిళ అకౌంట్‌ను వాడుకున్నారు. ఆమె పేరుతో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ యూజర్ ఐడీని క్రియేట్ చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పూరి సైబర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో జగన్నాథుడి ఆలయ పరిసరాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

## బంగ్లాలోని రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాలను వెనక్కి వచ్చేయాలని పిలుపు!

**న్యూఢిల్లీ,జనవరి 21:** ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఆందోళనకర పరిస్థితులు చూస్తుంటే భారత్‌పై బంగ్లావాసులు ద్వేషంతో రగిలిపోతున్నారు. మరోవైపు హిందువులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. హిందువుల్ని చంపడం, దాడి చేయడం, వారి ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి ఘటనలు బంగ్లాదేశ్ లో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్తితుల్లో ఇప్పటికే ఇరు దేశాల సంబంధాలు క్షీణించాయి. అక్కడ ఉన్న హిందువులతోపాటు భారతీయ అధికారులకు కూడా రక్షణ లేదనే నిర్ణయానికి ఇండియా వచ్చేసింది. అందుకే వారి భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌లో ఉన్న రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాల్ని తిరిగి ఇండియాకు వచ్చేయాలని ఆదేశించింది. బంగ్లాలోని భారత రాయబారి, ఇతర సిబ్బంది, వేరే విభాగాల్లో పని చేస్తున్న భారత సిబ్బంది కుటుంబ సభ్యుల్ని ఇండియాకు రావాలని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశించినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. నిర్ణయం సిబ్బంది కుటుంబ సభ్యులకు మాత్రమే అని సిబ్బంది మాత్రం అక్కడ పని చేస్తారని ఆయన తెలిపారు. భారతీయ రాయబార కార్యాలయం ఎప్పటిలాగే పని చేస్తుందని, ఇతర సేవలు కొనసాగుతాయని, ఎంతకాలంలోపు కుటుంబ సభ్యులు ఇండియా తిరిగి రావాలి అనే కాలపరిమితి విషయంలో ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం ఢాకాలో ప్రధాన రాయబార కార్యాలయం ఉండగా, ఛట్టోగ్రామ్, ఖుల్నా, రజ్షాహి, సిల్హెట్‌లలో రాయబార కార్యాలయాలున్నాయి.

## సంక్షిప్తంగా..

### మాజీ ప్రధాని హత్యకేసు నిందితుడికి యావజ్జీవ ఖైదు



**టోక్యో,జనవరి 21:** జపాన్ మాజీ ప్రధాని షింజో అబేను హత్య చేసిన 45 ఏళ్ల టెట్సుయా యమగామికి జీవితకాల జైలుశిక్ష పడింది. నారా జిల్లా కోర్టు ఆ శిక్షను ఇవాళ ఖరారు చేసింది. మాజీ ప్రధానిని హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. జపాన్ అధికార పార్టీ, వివాదాస్పద దక్షిణకొరియా చర్చి మధ్య సంబంధాలను వ్యతిరేకిస్తూ నిందితుడు మాజీ ప్రధాని హత్యకు ప్లాన్ చేశాడు. జపాన్ రాజకీయాల్లో అత్యధిక కాలం ప్రధానిగా చేసిన వ్యక్తిగా అబెకు రికార్డు ఉన్నది. అయితే ప్రధాని హోదాను విడిచిన తర్వాత ఆయన ఎంపీగా కొనసాగారు. నారా సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో అబేపై 2022లో కాల్పులు జరిపారు. గన్ కంట్రోల్‌పై పట్టు ఉండే జపాన్‌లో ఆ ఘటన జరగడం యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది.

### దావోస్‌లో ఆకట్టుకున్న మెక్రాన్ సన్‌గ్లాసెస్

**న్యూఢిల్లీ, జనవరి 21:** సామ్రాజ్యవాదం మళ్లీ పురుడుపోసుకుంటోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గ్రీన్‌లాండ్' హెచ్చరికలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తమ పెద్దన్న అమెరికాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దావోస్ లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దాంతో పాటు మెక్రాన్ తన సన్‌గ్లాసెస్‌తోనూ ఆకట్టుకున్నారు. కళ్లజోడు తీయకుండా ఆయన కనిపించిన తీరుపై నెట్టింట్లో పెద్ద చర్చే నడుస్తోంది. దావోస్ సదస్సు జరుగుతున్న వేదిక లోపల కూడా మెక్రాన్ సన్‌గ్లాసెస్ ఎందుకు ధరించారు? దీని ద్వారా డొనాల్డ్ ట్రంప్‌కు ఏదైనా సందేశం ఇస్తున్నారా? లేకపోతే ఇదేమైనా ఫ్యాషనా? అంటూ నెటిజన్లు వరుస పోస్టులు పెడుతున్నారు.

### రిటైర్‌మెంట్ ప్రకటించిన సునీతా విలియమ్స్



**న్యూయార్కు,జనవరి 21:** భారత సంతతికి చెందిన ప్రముఖ నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్(60) 27 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి వీడ్కోలు పలికారు. నాసా నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్ 25వ తేదీ నుంచే ఇది అమలులోకి వచ్చిందని నాసా పేర్కొంది. మానవ అంతరిక్ష ప్రయాణంలో సునీతా విలియమ్స్ మార్గదర్శకురాలు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆమె చూపిన నాయకత్వం, టెక్నాలజీ అభివృద్ధికి చేసిన సేవలు చంద్రుడు, మార్స్‌పై భవిష్యత్తులో చేయబోయే మిషన్లకు బలమైన పునాది వేశాయని నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ప్రశంసించారు. 1998లో నాసాకు ఎంపికయ్యారు. 27 ఏళ్ల పాటు అమెరికా అంతరిక్ష కేంద్రంలో ఆమె పనిచేశారు.

### ప్రయాగ్‌రాజ్‌లో కుప్పకూలిన శిక్షణ విమానం

**ప్రయాగ్‌రాజ్, జనవరి 21:** భారతీయ వైమానిక దళానికి చెందిన టూ సీటర్ మైక్రోలైట్ విమానం కుప్పకూలింది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్న పైలెట్‌తో పాటు సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. మైక్రోలైట్ విమానాన్ని సాధారణంగా శిక్షణ, బర్డ్ రెక్కీ, సర్వే కోసం వినియోగిస్తుంటారు. రెగ్యులర్ సోర్టీలో భాగంగా ఆకాశంలో ఎగురుతున్న సమయంలో విమానం కూలినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ చెరువులో అది కూలినట్లు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు. పప్పామావు, సంగం ప్రాంతాల్లో సోర్టీ నిర్వహిస్తున్నప్పుడు విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు ప్రయాగ్‌రాజ్ డీసీపీ తెలిపారు. పైలెట్లు సురక్షితంగా బయటకు వచ్చారని, జార్జ్‌టౌన్ పోలీసు ఏరియాలోని కేపీ కాలేజీ వద్ద చెరువులో ఆ విమానాన్ని దించినట్లు ఆయన చెప్పారు.

### మిస్టర్ ప్రెసిడెంట్! డెన్మార్క్ ఎంపి తీవ్ర విమర్శ



**కొపెన్‌హ్యాగన్, జనవరి 21:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు డెన్మార్క్ పార్లమెంట్‌లో ఊహించని పరాభవం ఎదురైంది. ఖనిజ నిక్షేపాలకు నిలయమైన గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని అమెరికాకు విక్రయించాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చర్చ జరుగుతుండగా ఎంపీ అత్యంత కటువైన పదజాలంతో విరుచుకుపడ్డారు. మిస్టర్ ప్రెసిడెంట్, ఫ ఆఫ్" అంటూ ఆగ్రహంతో సదరు ఎంపీ చేసిన అసభ్య పదజాలపు వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో మంచు కరుగుతున్న కొద్దీ అక్కడ కొత్త రవాణా మార్గాలు, అపారమైన ఖనిజ సంపద బయటపడుతున్నాయి. ఈ క్రమంలో రష్యా, చైనాల కంటే ముందే అక్కడ పట్టు సాధించాలని ట్రంప్ భావిస్తున్నారు. గ్రీన్‌లాండ్ తమ చేతిలో ఉంటే నాటో భద్రతకు, అమెరికా రక్షణకు తిరుగుండదు.



బుధవారం జరిగిన ధర్నాలో నినాదాలు చేస్తున్న దివ్యాంగులు

# దివ్యాంగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

## డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో డెవలప్ మెంట్ సొసైటీ ఫరద డెఫ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ఉద్యోగాలు విడుదల భర్తీ చేయుటకు ఆర్‌పి డబ్ల్యూడి యాక్ట్ 2016ను పటిష్టంగా అమలుచేయాలని వారు డిమాండ్‌చేశారు. ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణసౌకర్యం, స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. లేనిపక్షం వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మద్ మున్నా, నర్సింహా టైగర్, పి.వెంకటే శ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సంజయ్ మూర్తి,ఎన్ఐఆర్ డిపిఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్, డిప్యూటీ సిఎజి మనీష్ కుమార్,తదితరులు

# ముగిసిన ఆడిట్ విభాగాల జాతీయ వర్క్‌షాపు

**అత్తాపూర్, జనవరి21,ప్రభాతవార్త :** స్థానిక నిధి అడిట్ విభాగాల బలోపేతానికి పలు నిర్ణయాలు తీసుకున్నట్లు పలువురు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాలకు బాధ్యత వహించే ప్రాథమిక ఆడిటింగ్ సంస్థల (పిఎఐలు) సంస్థాగత చట్రం, వృత్తిపరమైన సామర్థ్యం, ఆడిట్ పద్ధతులను బలోపేతం చేసే లక్ష్యంతో, సిఐఎ ఆర్‌డి -ఎన్ఐఆర్‌డిపిఆర్, ఐసిఎఎల్ సహకారంతో నిర్వహించిన స్థానిక నిధుల ఆడిట్ డైరెక్టరేట్లు మరియు రాష్ట్ర ఆడిట్ విభాగాల జాతీయ వర్క్‌షాప్ బుధవారం రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డిపిఆర్‌లో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికిభారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సంజయ్ మూర్తి,ఎన్ఐఆర్ డిపిఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్, డిప్యూటీ సి ఏజీ మనీష్ కుమార్,పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సుశీల్ కుమార్ ,లోహాని ఐసిఎఎల్ డైరెక్టర్ జనరల్ హెచ్. కె. ధర్మదర్శి హాజరయ్యారు. వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ హేమంత కుమార్ మాట్లాడుతూ స్థానిక నిధుల ఆడిట్‌లో సవాళ్లు, పిఎఐ పరిపక్వత అంచనా, కాగ్ యొక్క సాంకేతిక మార్గదర్శకత్వం, మద్దతు ( టీజీఎస్) ఫ్రేమ్‌వర్క్, మరియు ఆడిట్ ప్రణాళిక, నివేదన, స్థానిక సంస్థలతో అనుసంధానంపై అనుభవాల పంచుకోవడం వంటి అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలు హైలైట్ చేసిన సవాళ్లు మరియు ఉత్తమ పద్ధతులను పరిగణనలోకి తీసుకుని, తగిన ఫాలోఅప్ మరియు వ్యవస్థ మెరుగుదల కోసం రాబోయే అన్ని రాష్ట్రాల కార్యదర్శుల వర్క్‌షాప్‌లో సమర్పిస్తామని ఎన్ఐఆర్ డిపిఆర్ డైరెక్టర్ జనరల్ పేర్కొన్నారు.



ఐటిసి వావ్ అవార్డు గ్రహీతలతో గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, రాజేష్, శంకర్, ఉమాకాంత్, మురళీరామిశెట్టి తదితర అతిథులు

# పిల్లల్లో పర్యావరణ పరిరక్షణ సంస్కృతిని పెంపొందించాలి

## రీసైక్లింగ్ ఛాంపియన్లకు ఐటిసి వావ్ పురస్కారాల ప్రదానంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**రవీంద్రభారతి, జనవరి 21 ప్రభాతవార్త :** చిన్ననాటి నుండే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణ సంస్కృతిని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్ వర్మ సూచించారు. బుధవారం రవీంద్రభారతిలో వెల్‌బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ (డబ్ల్యుఒడబ్ల్యు–వావ్) ఐటిసి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నరు హాజరై ప్రసంగించారు. స్వచ్ఛభారత్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతమైన వ్యర్థపదార్థాల విభజన, రీసైక్లింగ్, బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతుల ద్వారా విద్యార్థులు, పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్‌లు చేసిన అద్భుత కృషిని అభినందించారు. ఈ సందర్భంగా గవర్నరు విశిష్ట అతిథులు ఐటిసి లిమిటెడ్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పొన్నూరు, ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ సిటిశంకర్ బందోపాధ్యాయ, డిజిఎం ఎస్.ఎన్.ఉమాకాంత్, ఐటిసి వావ్ అమలు భాగస్వామి మోడ్ర్ ఆర్కిటెక్ట్స్ ఫర్ రూరల్ ఇండియా (ఎంఎఆర్ఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రామిశెట్టి తదితరులతో కలిసి సుస్థిర వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడంలో విశేష కృషిచేసిన విద్యార్థులు, పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్‌ల ప్రముఖులకు వావ్ అవార్డులు, పతకాలను అందజేశారు. పి.రాజేష్ మాట్లాడుతూ తమ ఘనవ్యర్థాల నిర్వహణ కార్యక్రమంలో విద్యార్థులు, సంస్థలు, ఆర్గనైజేషన్ల భాగస్వామ్యం తమకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల్లో అమలు చేయబడుతున్న ఈ కార్యక్రమం వ్యర్థాల విభజన, రీసైక్లింగ్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి విద్యార్థులను, విద్యాసంస్థలను చురుకుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

2025–26 ఎడిషన్ ఛాంపియన్‌షిప్‌కు 1.15లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొని 1.200 మెట్రిక్ టన్నుల పొడివ్యర్థాలను రీసైక్లింగ్ కోసం అందించారన్నారు. హైదరాబాద్, నల్గొండ, సూర్యాపేట, సిద్ధిపేట, సిరిసిల్ల, భద్రాచలం అంతటావున్న 614 పాఠశాలలతోపాటు ఐసిఎస్ఈ, సిబిఎస్ఈ, ఎస్ఎస్‌సి వంటి వివిధ బోర్డులకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి పాల్గొన్నారని చెప్పారు. 2028 నాటికి తన ప్యాకేజింగ్‌లో 100శాతాన్ని పునర్వినియోగపరచదగిన, రీసైకిల్ చేయదగిన/ కంపోస్ట్/ బయోడిగ్రేబుల్ అయ్యేలా చూడాలని ఐటిసి లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.



ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కోదండరాం, జి. అశోక్ కుమార్

# 50 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

## ఆరెకటికలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** బి.సి.లకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే నా అంతిమ లక్ష్యమని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. బుధవారం అరెకటిక అభివృద్ధి సంఘం అధినేత జి. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అరెకటికల సర్పంచ్‌ల ఆత్మీయ సన్మాన సభకు కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రొఫెసర్ కోదండరాం, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి, సర్పంచులు డిప్యూటీ సర్పంచులు వార్డు మెంబర్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వం ఆరెకటికల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్ర జి. దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సినాపతి, భూంపల్లి అశోక్ దాదా.కె.నాగేశ్వర్. ఉపాధ్యక్షులు ఎం.నాగ శేషు. కే వెంకటేష్ తదితరులున్నారు.

# ప్రపంచంలోనే తొలి బ్యూటీ- టెక్ జిసిసి

## హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు నప్రకటించిన లోరియల్ సంస్థ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి21:** ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి)ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ –2026లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ–టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్



ట్రాన్స్ ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది.నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను లోరియల్ ఆహ్వానించింది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు.హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ–టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్, కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (టిఏఐహెచ్) గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యు ఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్‌ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

# టిఎస్ఆర్‌టిసిలో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి మార్చి 29న పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్టీసీలో ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, మెకానికల్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి మార్చి 29వ తేదీన రా త పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 84 ట్రాఫిక్ సూపర్ వైజర్ల పోస్టులతో పాటు 114 మెకానికల్ సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సూపర్ వైజర్ల పో స్టుల కోసం 20,097 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇందులో ట్రాఫిక్ సూపర్ వైజర్ల కోసం 6489 మంది మహిళలు వున్నారని, మెకానిక ల్ సూపర్ వైజర్ల పోస్టులకు 6063 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 735 మంది మహిళలు వున్నారని శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 29వ తేదీన రాత పరీక్షలు వుంటాయని ఆయన తెలిపారు. ట్రాఫిక్ సూపర్ వైజర్ల పోస్టులకు ఉదయ ం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు వుంటాయని, మెకానికల్ సూపర్ వైజర్ల పోస్టులక మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రాత పరీక్షలు వుంటాయని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలు హైదరాబాద్‌తో పాటు శివార్లలో వుంటాయని ఆయన తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఠాణా ముందు ఆందోళన నేపథ్యంలో..

# 12మంది బిఆర్ఎస్ మహిళా నేతలపై కేసు

**హైదరాబాద్(జూబ్లీహిల్స్), జనవరి 21, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సిట్ విచారణ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఠాణా ముందు ఆందోళనకు దిగిన 12 మంది బీఆర్ఎస్ మహిళా నేతలపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం మాజీ మంత్రి హరీష్ రావును ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మంగళవారం సిట్‌అధికారులు జూబ్లీహిల్స్ ఠాణాలో విచారించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే హరీష్‌రావు విచారణను వ్యతిరేకిస్తూ ఠాణా ముందు బీఆర్ఎస్ మహిళా నేతలతోపాటు పలువురు నేతలు ఠాణావద్ద అకస్మాత్తుగా గుమిగూడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మెట్టుగూడ కార్పొ రేటర్ సునీత, బీఆర్ఎస్ మహిళా నేత పావనీగౌడ్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నాయకురాలు కె.కవిత, సిద్దిపేటకు చెందిన మహిళా నాయ కులు పద్మ,సుగుణ, బండ్లగూడ జాగీర్‌కు చెందిన శాంతినాయక్, అమీర్‌పేటకు చెందిన అన్నంపల్లి ప్రమీల, పటాన్‌చెరువుకు చెందిన నాయకురాలు ఉట్టపల్లి ఉమ, అంబర్‌పేటకు చెందిన శోభరాణి ముదిరాజ్, కామారెడ్డికి చెందిన సుమిత్రానంద్, కరీంనగర్‌కు చెందిన గంటల రేణుక,అమీన్‌పూర్‌కు చెందిన విజయలను ముందస్తు అరెస్ట్ చేశారు. వారిపై 170 బీఎన్ఎస్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తుపై వదిలివేశారు.

# సింగరేణిపై సిబిఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకు రావాలి



## సింగరేణికి రూ.47వేల కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారు?

## ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి21:**దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని,అయితే తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణకు గుండెలాంటి సింగరేణి ఇప్పుడు అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సిం గరేణిని బంగారు బాతులా కాంగ్రెస్ వాడుతోందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గు అందించాలని.. కేంద్రం నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయిం చిందని, కోల్ బ్లాక్‌కు కేంద్రం అన్ని అనుమతులు ఇచ్చిందని స్పష్టం చేశారు. అయితే, టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. టెండర్లు రద్దు చేయడమంటే సింగరేణికి అన్యాయం చేసినట్లేనన్నారు. **సైట్ విజిట్‌కు..** సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని, అయితే సైట్ విజిట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధనని పేర్కొన్నారు. కానీ.. సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టడమేంటి? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. నచ్చినవారికి నైనీ కోల్ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారన్నారు. గతంలో బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని వాడుకుంటున్నాయని, లాభాల బాటలో ఉన్న సింగరేణిని సమస్యల నిలయంగా మార్చారని కిషన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. నచ్చిన వారికి విజిట్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, సింగరేణిని రాజకీయ ప్ర యోగశాలగా మార్చేశారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

**సింగరేణిలో కేంద్రం వాటా 49 ..** కానీ పెత్తనం రాష్ట్రానిదని విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ రకమైన అధికారం లేదని, ఏడుగురు డైరెక్టర్లలో కేంద్రం నుంచి ఇద్దరే ఉంటారని తెలిపారు. సీఎండీ నియామకం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉందన్నారు. కేసీఆర్ హయాంలో ఆడిందే ఆటగా కొనసాగిందని, రాజకీయ జోక్యంతో సింగరేణిని సమస్యల్లోకి నెట్టివేశారని ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల చెమట, రక్తాన్ని దోచుకుంటున్నారని అన్నారు. ఈ విషయంపై సీబీఐ విచారణ జరపాలంటున్నారని అయితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కూడా కావాలని తెలిపారు. ఈ వివాదంలోకి అనవసరంగా తనను లాగుతున్నారన్నారు. బిఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ సింగరేణిని విధ్వంసం చేస్తున్నాయన్నారు. అక్రమ లావాదేవీలు, తెరవెనుక ఒప్పందాలు సింగరేణి భవిష్యత్‌ను ప్రమాదంలో పడేస్తున్నారని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే.. సింగరేణి వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. గతంలో తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని, మైనింగ్ చేస్తామని సింగరేణి ముందుకొస్తే బిఆర్ఎస్ బెదిరించిందన్నారు. తాము మైనింగ్ చేయబోమని బలవంతంగా లేఖ ఇప్పించిందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలకు వెళ్లేలా నాడు బిఆర్ఎస్ వ్యవహరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథా కొనసాగిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

నైనీ కోల్ బ్లాక్ విషయంలోనే కాకుండా.. పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని కిషన్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే సీబీఐ దర్యాప్తుపై కేంద్రం పరిశీలిస్తుందన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 వేలకోట్ల బకాయిలు చెల్లించాలని, ఆ బకాయిలు ఎప్పుడిస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ తగ్గిపోయిందన్నారు. సింగరేణి బొగ్గును చాలా రాష్ట్రాలు వద్దంటున్నాయని, సింగరేణి సంస్థ ఉనికే ప్రమాదకర స్థాయికి చేరిందన్నారు.

సింగరేణి భూముల్లో అనేక ఆక్రమణలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చర్యలకు కేంద్రం సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# వీధికుక్కలను చంపడాన్ని సహించబోం: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి21:** కొన్ని గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలకు విష ప్రయోగం చేసి చంపినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ ఘటనల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సంబంధిత ఘటనలపై ఇప్పటికే పోలీసు కేసులు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతున్నారని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. వీధి కుక్కల బెడద ఉందన్న నెపంతో అమానుషంగా కుక్కలను చంపడం చట్టవిరుద్ధం మాత్రమే కాదు, మానవత్వానికి పూర్తిగా విరుద్ధమని, ఇలాంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. మూగజీవాలను విషం పెట్టి చంపడం వంటి దారుణమైన చర్యలు పూర్తిగా నేరమని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కొన్ని గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే విషయం స్థానిక సర్పంచుల దృష్టికి రావడం సహజమేనని, అయితే ఆ సమస్యకు పరిష్కారం అనేది చట్టబద్ధమైన, శాస్త్రీయమైన, మానవీయమైన మార్గాల్లోనే చేయాలి తప్ప అతి దారుణమైన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని హితువు పలికారు. వీధి కుక్కల నియంత్రణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా టీకాలు, కుటుంబ నియంత్రణ (స్టెరిలైజేషన్) వంటి శాస్త్రీయ పద్ధతులను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. మూకుమ్మడిగా విషం పెట్టి చంపడం వంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు.



ప్రభుత్వం తరఫున ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నామని. బాధ్యులపై ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, వీధి కుక్కల వల్ల సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, మానవీయత, చట్టబద్ధత, శాస్త్రీయతే ప్రభుత్వ విధానం అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# 50 కులాలను సంచార జాతులుగా గుర్తించిన బిసి కమిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి21:** రాష్ట్రంలో 50 కులాలను సంచార జాతులుగా రాష్ట్ర బిసి కమిషన్ గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి చేయనున్న సిఫార్సులను కమిషన్ ఆమోదించింది. రాష్ట్ర బిసి కమిషన్ సమావేశం బుధవారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె.మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న సీడ్ పథకానికి అర్హులకు కావాల్సిన డిఎన్‌టి సర్టిఫికేట్ జారీ విధివిధానాలపై చర్చించింది. 50 కులాలను సంచార జాతులుగా గుర్తించి ఈ కులాలకు సంబంధించిన సర్టిఫికేట్ జారీలో చేపట్టవలసిన మార్పులు, చేర్పుల గురించి కూడా ప్రభుత్వానికి సిఫారసులను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల్లో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ మినహా మిగతా అన్ని శాఖల నుండి కమిషన్‌కు సమాచారం అందింది. ఈ సమాచారాన్ని క్రోడీకరించి ఉద్యోగరంగంలో బిసి స్థితిగతులను అంచనా వేయడానికి ఉపయోగించనున్నట్లు కమిషన్ వెల్లడించింది.

# రెండో రోజుకు చేరిన ఎమ్మెల్యే శ్రీగణేష్ రిలే నిరాహారదీక్ష




**కంటోన్మెంట్,జనవరి 21 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతా లను జిహెచ్ఎంసీలో విలీనం చేసేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు అనూహ్య స్పందన లభించింది. బుధవారం 2వ దీక్షకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వసుజాత, ఐఎన్‌టీయూసి రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఎంపీ ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు అన్నిన విదాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. లేని పక్షంలో తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

# అడవి వీడిన 576 మంది మావోయిస్టులకు పోలీసుల సాయం

## అజ్ఞాతంలో ఉన్న 17 మంది కీలక నక్సలైట్ల జాబితా విడుదల చేసిన పోలీసు శాఖ

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** అజ్ఞాతం వీడిన మావోయిస్టులకు తెలంగాణ పోలీసు శాఖ అండ దండలు అందజేస్తోంది. గత ఏడాది 576 మంది నక్సలైట్లు లొంగిపోగా వీరందరికి నగదు రివార్డులతో పా టు పునరావాసం కల్పించారు. వీరికి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, బ్యాం కు ఖాతాలు అందేలా చేశారు. పోలీసు శాఖలో కీలకంగా వున్న ఎస్ఐబి లొంగిపోయిన నక్సలైట్ల పునరావాస బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తోంది. ఎస్ఐబి ఐజిగా వున్న సుమతి వీటిని స్వయంగా పర్యవేక్షిస్తూ ఎక్కడా పోలీసు శాఖకు, ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూస్తున్నారు. లొంగిపో యిన వారికి వారి వారి స్వగ్రామాలలో నివాస ధృవపత్రాలు ఇప్పించి, అక్కడే ఆధార్ నమోదు చేయిస్తున్నారు. అక్కడే బ్యాంకు ఖాతాలు ఇప్పిస్తునా న్నరు. స్థానిక రెవెన్యూ అధికారులతో మాట్లాడి అవకాశం వున్న వారికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మావోయిస్టులు, వ ృద్ధాప్యంతో బాధపడుతున్న వారికి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. తెలంగాణ పోలీసు శాఖ లొంగిపోయిన నక్సలైట్లకు ముందుగా చెప్పినట్లుగా పునరావాసం కల్పిస్తుండడంతో పాటు వారికి



చొక్కా రావు · భవాని · కుంజా · చందర్‌రావు · సుశీల · భాగ్య

ఇతర సౌకర్యాలను అందచేస్తోందని డిజిపి శివధర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ నేపథ్యంలో అజ్ఞాతంలో వున్న మిగతా నక్సలైట్లు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని డిజిపి కోరారు.

**అజ్ఞాతంలో వున్న 17 మంది మావోయిస్టుల జాబితా విడుదల:** ఇదిలావుండగా తెలంగాణలో కార్యకలాపాలు సాగించి అజ్ఞాతంలో వున్న 17 మంది నక్సలైట్ల జాబితాను డిజిపి కార్యాలయం విడుదల చేసింది. ఇం దులో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి ముందుగా వున్నారు. ఈయనపై 25 లక్షల రి వార్డు వుంది. ఆయన తరువాత పార్టీ కార్యదర్శిగా చెప్పుకుంటున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పేరు వుంది. ఆయన హోదాను పార్టీ జనరల్ సెక్రటరీగా చూపారు. ఆయనపై 25 లక్షల రివార్డు వుంది. వీరి తరువాత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రాం. కేంద్ర కమిటీ సభ్యులు. ఈయనపై 25 లక్షల రివార్డు వుంది. పుసునూరి నరహరి అలియాస్ సంతోష్. ఈఆర్‌బి సభ్యుడు. ఈయనపై 20 లక్షల రివార్డు వుంది. ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్. రాష్ట్ర కమిటీ సభ్యుడు. ఈయనపై 20 లక్షల రివార్డు వుంది. వార్త శేఖర్ అలి యాస్ ముంగ్తు. డికెఎస్‌జెడ్‌సి సభ్యుడు, క మ్యూనికేషన్స్ వింగ్ ఇంచార్జ్. ఈయనపై 20 లక్షల రివార్డు వుంది. జోడే రత్నా భాయి అలియాస్ సుజాత. డికెఎస్‌జెడ్‌సి సభ్యురాలు. ఈమెపై 20 లక్షల రివార్డు వుంది. లోకేష్ చందర్ రావు అలియాస్ ప్రభాకర్. వెస్ట్ జోనల్ బ్యూరో కార్యదర్శి, ఈయనపై 20 లక్షల రివార్డు వుంది. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సైనిక వ్యవహారాల ఇంఛార్జి. ఈయనపై 20 లక్షల రివార్డు వుంది. నక్కా సుశీల అలియా స్ రేటా డిసిఎం సభ్యురాలు, ఈమెపై ఐదు లక్షల రూపాయల రివార్డు వుంది. జాడి పుష్ప అలియాస్ రాజేశ్వరి. డిసిఎం సభ్యురాలు. ఈమెపై ఐ దు లక్షల రూపాయల రివార్డు వుంది. రంగబోయిన భాగ్య అలియాస్ రూపి ఏరియా కమిటీ సభ్యురాలు. ఈమెపై నాలుగు లక్షల రూపాయల రివా ర్డు వుంది. బాదిషా ఉంగా అలియాస్ మంతు. ఏరియా కమిటీ సభ్యురాలు. ఈమెపై నాలుగు లక్షల రూపాయల రివార్డు వుంది. మడివి అడుసు అలియాస్ సంగీత. ఏరియా కమిటీ సభ్యురాలు. ఈమెపై నాలుగు లక్షల రూపాయల రివార్డు వుంది. కాశపోగు భవాని అలియాస్ సుగుణ. ఏరియా కమిటీ సభ్యురాలు.

ఈమెపై నాలుగు లక్షల రూపాయల రివార్డు వుంది. కుంజం ఇడమిల్ ఏరియా కమిటీ సభ్యుడు. ఇతనిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు వుంది. ఉతిమి అనిల్ కుమార్ అలియాస్ భరత్. పార్టీ సభ్యుడు. కంప్యూటర్ ఆపరేటర్. ఇతనిపై లక్ష రూపాయల రివార్డు ఉంది.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయం

## మున్సిపల్ ఎన్నికలపై కెటిఆర్ మీడియాతో చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి21:** మున్సిపల్ ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్, నేను ప్రచారం చేసేదేమీ ఉం డదని సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ భవన్లఓ మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచామని.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలేనన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నామని.. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం. పదేళ్లలో మేము చేసినవి.. కాంగ్రెస్ రెండేళ్లుగా చేయనివి గుర్తు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్

## అధికారులకు వైద్య మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి21:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో వైద్య విద్య బోధనను మెరుగుపరిచే దిశగా వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు.

# తొలి టి20లో కివీస్‌పై భారత్ అదిరే బోణీ..

## 41 పరుగులతో న్యూజిలాండ్ జట్టు ఓటమి



**నాగ్‌పూర్,జనవరి 21:** ప్రపంచ కప్ సన్నాహక సిరీస్‌లో భారత్ జట్టు బోణీచేసింది. న్యూజిలాండ్ జట్లమధ్య జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ బోణీకొట్టింది. న్యూజిలాండ్‌పై 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన టీమిండియా ఏడు వికెట్లనష్టానికి 238 పరుగులుచేసి కివీస్‌జట్టుకు భారీ లక్ష్యం విదించింది. లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ ఏడు వికెట్లనష్టానికి నిర్ణీత ఓవర్లలో 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీనితో 48 పరుగులు తేడాతో భారత్ తొలిమ్యాచ్‌లో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఐదు ఫోర్లు ఎనిమిది సిక్స్‌లతో అభిషేక్‌వర్మ దుమ్ము దులిపాడు. 84 పరుగులుచేసి ఔరా అనిపించాడు. మ్యాచ్ విజయానికి అభిషేక్,రింకూసింగ్, వరుణ్‌లు కీలకంగా కొనసాగారు. ఇన్నింగ్స్ నిదానంగా ప్రారంబించిన సంజుశాంసన్ ఏడు బంతుల్లో రెండు బౌండరీలు బాది పది పరుగులేచేసి పెవిలియన్ కు చేరాడు. ఆవెంటనే వచ్చిన ఇషాన్‌కిషన్ బౌండరీతో ఇన్నింగ్స్ ప్రారంభించి ఐదు బంతుల్లో ఎనిమిది పరుగులేచేసి వెనక్కి తిరిగాడు. 3 ఓవర్లకే రెండు వికెట్లు నష్టపోయిన భారత్‌జట్టును అభిషేక్‌శర్మ,సూర్యకుమార్‌యాదవ్‌లు పరుగులు తీయించారు. అభిషేక్‌శర్మ సిక్సర్లతో మోతమోగిస్తే సూర్యకుమార్ బౌండరీలతో ఉరుకులు పెట్టించాడు. 22 బంతుల్లోనే అర్థశతకం బాదేసిన అభిషేక్ న్యూజిలాండ్‌పై అతితక్కువ బంతుల్లో 50 పరుగులుచేసిన క్రికెటర్‌గా నమోదయ్యాడు. సూర్యకుమార్‌యాదవ్ 22 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో 32పరుగులుచేసాడు. అభిషేక్‌శర్మ ఔట్ అయ్యేసరికి 12 ఓవర్లలోనే భారత్ 149 పరుగులుచేసింది. శివమ్‌దూబే 4 బంతుల్లో తొమ్మిది పరుగులు. హార్దిక్ 16 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 25 పరుగులకే నిరాశపరిచాడు. హిట్టర్లంతా ఔట్ అవుతుండటంతో చివరిలో స్కోరుబోర్డు నిదానంగాసాగింది. చివరి ఓవర్‌లో రింకూ సిక్సర్ల వర్షం కురిపించాడు. డారిల్‌మిచెల్‌వేసిన 20వ ఓవర్‌లో మొదటి రెండు బంతుల్లో సిక్సర్లు బాదిన రింకూసింగ్ నాలుగోబంతి ఆరోబంతిని ఫోర్లుగా మలిచాడు. రింకూసింగ్ 20 బంతుల్లో 4ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్‌లో భారత్‌మొత్తం 21ఫోర్లు, 14 సిక్సర్లతో 20 ఓవర్లలో ఏడు వికెట్లనష్టానికి 238 పరుగులుచేసి ప్రత్యర్థికి 239 పరుగుల లక్ష్యం విధించింది. తదనంతరం లక్ష్యఛేదనలో తడబడిన కివీస్‌జట్టు 190 పరుగులతోనే సరిపెట్టుకుని భారత్ విజయానికి బాటలువేసింది. కివీస్‌జట్టులో గ్లెన్ ఫిలిప్స్ 78, టిమ్ రాబిన్‌సన్ 21, మార్క్ చాప్‌మన్ 39, డారిల్‌మిచేల్ 28, శాంట్నర్ 20 పరుగులుచేసారు. మొదటి ఓవర్‌లోనే డెవాన్ కాన్వేఓ ట్ కావడం, పాండ్యా ఓవర్‌లో రచిన్‌రవీంద్ర వెనుదిరగడంతో రెండుపరుగులకే రెండు వికెట్లు నష్టపోయింది. తదనంతరం మార్క్ చాప్‌మన్; ఫిలిప్స్ పెద్దషాట్లు ఆడి స్కోరును 130 దాటించారు. చివరిలో డారిల్‌మిచెల్, కెప్టెన్ శాంట్నర్‌లు కొంతవరకూ జట్టును ఆదుకున్నారు. శివందూబే 28 పరుగులిచ్చి రెండు వికెట్లు తీసాడు. చివరి ఓవర్‌లో బౌండరీ లైన్‌వద్ద బిష్ణోయ్ సూపర్‌క్యాచ్‌తో మార్ష్ డగౌట్ చేరాడు. తర్వాత బంతికే క్లార్క్ రింకూచేతికి చిక్కి ఔట్ కావడంతో కివీస్ 190 స్కోరుకే పరిమితం అయింది. భారత్‌బౌలర్లలో వరుణ్‌చక్రవర్తి, శివమ్‌దూబె రెండేసి వికెట్లు తీసారు. అర్ష్‌దీప్‌సింగ్, హార్థిక్ పాండ్య, అక్షర్‌పటేల్ చెరొక వికెట్ తీసారు.

# శ్రీశైలం రక్షణ కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు

## కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రమాద ముప్పు పొంచి ఉందంటూ జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ప్రాజెక్టు రక్షణ, మరమ్మతుల కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను సాంకేతిక నిపుణుల బృందాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ వాఖ శాఖ ఏర్పాటు చేసింది. సాంకేతిక నిపుణుల కమిటీకి కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లోని డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ వివేక్ త్రిపాఠి సారథ్యం వహించనున్నారు. ఈ బృందంలో సీడబ్ల్యూసీలోని డైరెక్టర్ (ఎంబార్క్‌మెంట్) సోమేష్‌కుమార్, డైరెక్టర్ (సీఎండీడీ) స్మామ్రాట్ అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్లు(సీఎండీడీ) అరుణ్ ప్రతాపసింగ్, మధుకాంత్ గోయల్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్త మనీశ్ గుప్తా, కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్‌పుణె) శాస్త్రవేత్త ఎం.కె.వర్మ, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) డైరెక్టర్ (ఇంజనీరింగ్ జియాలజీ డివిజన్) శైలేంద్రసింగ్‌తోపాటు ఏపీ జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్)ను సభ్యులుగా చేర్చారు. శ్రీశైలం జలాశయం కింద భూగర్భంలోని భారీ రాతి ఫలకాల మధ్య పెలుసుతో కూడిన బలహీన అతుకులు ఉన్నట్టు జీఎస్ఐ సమాచారం ఇచ్చింది. మరోవైపు నిలువున రెండు భారీ జాయింట్లు, వాటికి అనుబంధ జాయింట్లు ఉన్నాయని, అనుబంధ జాయింట్ల మధ్య దూరం పెరిగితే డ్యామ్ పునాదులు జారిపోయే ప్రమాదం ఉందని ఎన్‌డీఎస్ఏ పేర్కొంది. డ్యామ్ దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ (భారీ గుంత) 120 మీటర్ల లోతు ఉందని 2018 జూలైలో నిర్వహించిన బాతిమెట్రిక్ సర్వేలో తేలింది.



# స్పోర్ట్స్ స్టేడియాల అభివృద్ధిలో,మూసీ పునరుజ్జీవనంలో భాగస్వామ్యం అయ్యేందుకు టాటా ఆసక్తి

## దావోస్‌లో టాటా చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో సిఎం రేవంత్‌రెడ్డి కీలక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి21:** దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ విజన్-2047, ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని టాటా చైర్మన్‌కు వివరించారు.తెలంగాణ రాష్ట్రం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. భవిష్యత్ అవసరాలకు ప్రణాళికాబద్ధమైన ఆలోచన విధానంపై టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రశంసించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ఆలోచనలు,2036 ఒలింపిక్స్ లో భారత్ పతకాలు సాధించేలా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను వివరించారు.హైదరాబాద్ లో చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై టాటా ఛైర్మన్ ఆసక్తి చూపారు. శ్రీశైలం రహదారి వెంబడి అంతర్జాతీయ స్థాయి రిసార్ట్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించింది.ఏఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్, ఈవీ తయారీ రంగాల్లో తెలంగాణలో కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశాలపై టాటా చైర్మన్ ఆసక్తి ప్రదర్శించారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టాస్క్, స్కిల్ యూనివర్సిటీ గొప్ప ఆలోచనలు

**సిస్కో ప్రతినిధుల ప్రశంసలు :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ (టిఏఎస్‌కె), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యు) యువతకు ఉద్యోగాలు వచ్చేలా నైపుణ్యాలు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిందని, ఇది చాలా గొప్ప ఆలోచన అని సిస్కో గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ గై డీడ్రిచ్ ప్రశంసించారు.ఈ సమావేశంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను భవిష్యత్తులో ఉద్యోగాలు, పరిశ్రమలు, పెట్టుబడులు ఎక్కువగా వచ్చే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

# గ్రీన్‌ల్యాండ్ ఐస్‌కింద అమెరికా రహస్య స్థావరం

**నూక్(గ్రీన్‌ల్యాండ్), జనవరి 21:** యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన సైనిక స్థావరం ఒకటి దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్ మంచు పొరల కింద కూరుకుపోయిన క్యాంప్ సెంచరీ అనే ఈ బేస్‌ను నాసా శాస్త్రవేత్తలు ఇటీవల రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తించారు. నాసా శాస్త్రవేత్తలు గల్ఫ్‌స్ట్రీమ్ విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్‌పై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. అధునాతన రాడార్ వ్యవస్థను పరీక్షిస్తున్నప్పుడు, పిటుఫిక్ స్పేస్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మంచు కింద సహజత్వానికి భిన్నంగా, సరళ రేఖల్లో ఉన్న నిర్మాణాలను రాడార్ సిగ్నల్స్ పసిగట్టాయి. చారిత్రక మ్యాపులతో సరిపోల్చగా, అది క్యాంప్ సెంచరీ అని నిర్ధారించుకున్నారు. 1959లో అమెరికా ఆర్మీ ఇంజినీర్లు ఈ బేస్‌ను నిర్మించారు. మంచు కింద నగరం అని పిలిచే ఈ స్థావరం కోసం మంచులో 8 మీటర్ల లోతున సొరంగాలు తవ్వి, పైన మంచుతో కప్పేశారు. సుమారు 200 మంది సిబ్బంది నివసించేలా ల్యాబొరేటరీలు, నివాస గృహాలు నిర్మించారు. దీనికి పోర్టబుల్ న్యూక్లియర్ జనరేటర్‌తో విద్యుత్‌ను అందించేవారు.

# యువ బిలియనీర్లలో భారత్ టాప్..!

## అవెండస్, హురూన్ ఇండియా నివేదిక వెల్లడి

## భారత్‌నుంచి 201 మంది యువ బిలియనీర్లు

**ముంబయి, జనవరి 21:** ప్రపంచవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల విషయంలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 40 ఏళ్లలోపు వయసున్న మిలియనీర్ల (వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద) జాబితాలో చైనా, యూకే వంటి దేశాలను భారత్ అధిగమించింది. అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్, హురున్ ఇండియా సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో మొత్తం 505 మంది యువ వ్యాపారవేత్తలు ఉండగా, వారిలో 201 మంది భారతీయులే ఉన్నారు. భారత్ నుంచి 201 మంది, చైనా నుంచి 194 మంది, యూకే నుంచి 110 మంది యువ వ్యాపారవేత్తలు ఈ జాబితాలోకి చేరారు.

# ఐరోపా సవ్యదిశలో కొనసాగలేకపోతోంది...

## దావోస్ సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**దావోస్, జనవరి 21:** ఐరోపా సరైన దిశలో పయనించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్వజమెత్తారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐరోపాలో వలసలపై సరైన నియంత్రణ లేదని అన్నారు. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. అమెరికాను చూసి ఐరోపా సమాఖ్య కొన్ని అలవరుచుకోవాలని సూచించారు. ప్రపంచ వృద్ధికి ఆర్థిక గ్రోత్ ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వివిధ దేశాలపై సుంకాల విధించడం ద్వారా తమ వాణిజ్య లోటును గణనీయంగా తగ్గించామని ఆయన తెలిపారు. వెనెజులాకు ఇప్పుడు సమర్థవంతమైన కొత్త నాయకత్వం లభించిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా తప్ప మరే ఇతర దేశం కూడా సురక్షితంగా ఉంచలేదని ఆయన స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ కొనుగోలుపై తక్షణమే చర్చలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. డెన్మార్క్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. డెన్మార్క్ కృతజ్ఞత లేని దేశమని ఆయన అభివర్ణించారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత గ్రీన్‌ల్యాండ్‌ను తిరిగి అప్పగించడం అమెరికా చేసిన పొరపాటని ఆయన అన్నారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లకు చెక్

## ఇక నుండి బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన కష్టాలకు చెక్ పెట్టబోతోంది. రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జీతాలను జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ ఏప్రిల్ నెల నుంచి ప్రారంభంకానున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ఆ శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం వినిమం స్కేల్ పొందుతున్న ఉద్యోగులందరికీ ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ లేదా ప్రత్యేక పోర్టల్ ద్వారానే చెల్లింపులు జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో ప్రతినెలా వీరికి క్రమం తప్పకుండా జీతాలు అందే అవకాశం కలుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# పంటల అప్పులు తీర్చలేక..వేర్వేరు జిల్లాల్లో ముగ్గురు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** సాగు కలిసిరాక, చేసిన అప్పులు తీరే మార్గం కనిపించక అప్పుల బాధతో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనలు రాష్ట్రంలోని ఆదిలాబాద్, భూపాలపల్లి, మెదక్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పిట్‌గావ్ గ్రామానికి చెందిన జాదవ్ అంకుష్ (33) అనే రైతు తనకున్న మూడెకరాల్లో పత్తి, కంది సాగు చేశారు. ఇందుకోసం అవసరమైన పెట్టుబడి కోసం అందినకాడల్లా అప్పులు చేశారు. అయితే పంటలు కలసి రాక, నష్టాలు పాలైన ఆయన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గు రైన పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. అలాగే భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన కోడెల సదానందం (42) పోతులవాయి శివారులో తన 4 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.2 లక్షలకు పైగా అప్పు తీర్చలేక అలాగే ఉండిపోయాయి. పంటల్లో నష్టం రావడంతో ఈ అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బతుకమ్మతండాకు చెందిన దేవ్‌సోత్ సర్వేశ్ (57) అనే రైతు తనకున్న ఎకరం ఐదు గుంటల పొలంలో బోరు వేశారు. దీంతో పాటు, ఇల్లు కట్టి, ఇద్దరు కుమారుల పెండ్లి చేయడానికి రూ.8 లక్షల వరకు అప్పు చేశారు. ఈ అప్పులు ఎక్కువయ్యే సరికి వాటిని ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. వాటిని తీర్చే మార్గం లేక గడ్డిమందు తాగినట్టు బలవన్మరణానికి పాల్పడ్డారు.

# బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేను ఎలా అనుమతిస్తారు?: జీవన్ రెడ్డి

## గాంధీభవన్‌లో సమీక్ష సమావేశానికి వచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి21:** నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సమీక్షలో ఎలా పాల్గొంటారని ఆయన ప్రశ్నిం చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి విజయం సాధించిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పక్షాన కొనసాగుతుండడం తెలిసిందే. బుధవారం గాంధీ భవన్‌లో నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ పాల్గొనడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలోనే జీవన్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ భవన్ బయట మీడియాతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేని కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌లోనే ఉన్నట్లు సంజయ్ అఫిడవిట్ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు.

# తెలంగాణలో 16 మందికి ఐఏఎస్ హోదా

## గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలోని సివిల్ సర్వీస్ అధికారులకు హోదా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ కేటగిరీల కింద ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ రాష్ట్రంలోని మొత్తం 16 మంది అధికారులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) హోదా కల్పించింది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డిఒపిటి) బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించి ఎంపిక చేసిన అధికారులను తెలంగాణ క్యాడర్‌కు కేటాయిస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు నోటిఫికేషన్లో పేర్కొంది. దీంతో సుదీర్ఘ కాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు ఈ నిర్ణయంతో భారీ ఊరట లభించింది. ఐఏఎస్ కింద రాష్ట్ర క్యాడర్‌కు ఎంపికైన అధికారుల సెలక్షన్ జాబితా 2022లో ఎం.సత్యవాణి, జి.లింగయ్య నాయక్, డి. మధుసూదన్ నాయక్, జె.భవానీ శంకర్, జి. వీరారెడ్డి, పి.చంద్రయ్య, ఎ. నరసింహారెడ్డి, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, యు.రఘురామ్ శర్మ, ఎ.భాస్కర్ రావు, జి.ముకుంద రెడ్డి ఉన్నారు. అలాగే సెలక్షన్ లిస్ట్ 2023కు సంబంధించి అబ్దుల్ హామీద్,బి.వెంకటేశ్వర్లు, వై.వి.గణేష్, సెలెక్ట్ లిస్ట్ 2024లో కె.గంగాధర్, ఎన్.ఖీమ్యా నాయక్‌ఉన్నారు. అయితే దీనికి సంబంధించి కేంద్రం మరో నిబంధన తెరముందుకు తెచ్చింది. ఈ నియామకాలు తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ (డబ్ల్యూపి నెంబరు 32415/2023) తుది తీర్పునకు లోబడి ఉంటాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.50 లక్షల జరిమానా

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** పంటల సాగులో విచ్చల విడిగా పురుగుమందుల వాడకంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యంగా నకిలీ పురుగుమందుల వినియోగం, అమ్మకాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోనుంది. దీనికి అడ్డుకట్ట వేయడంలో భాగంగా కేంద్రం చట్టాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దీనికి సంబంధించి వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ముసాయిదా బిల్లును రూపొందించి రాష్ట్రాలకు పంపించింది. ఈ ముసాయిదాపై ఫిబ్రవరి 4లోపు అభిప్రాయాలు, సూచనలు పంపాల్సిందిగా కేంద్రం కోరింది.

# ముగుస్తున్న చలికాలం.. అప్పుడే చుర్రుమంటున్న ఎండలు

## రాష్ట్రంలో తగ్గిన చలితీవ్రత...పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** ఈ ఏడాది చలికాలం ఇక ముగింపు దశకు చేరుకుంది. సంక్రాంతి పండగ ముగిసిన తరువాత చలితీవ్రత తగ్గుతుందని వాతావరణ శాఖ వెల్లడించినట్లుగానే గడచిన వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల ఉష్ణోగ్రతలు పెరగగా చలిగాలుల ప్రభావం చాలావరకు తగ్గింది. గత ఏడాది అంటే 2024-2025 సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 2025-2026లో చలి ప్రభావం రాష్ట్రంలో ఉమ్మడి ఆ దిలాబాద్, మెదక్, రంగారెడ్డితో పాటు ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాలు మినహాయించి హైదరాబాద్ వంటి మైదాన ప్రాంతాలలో కొంతమేరకే వుండిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణంగా చలికాలం అంటే కనీస ఉష్ణోగ్రత పది డిగ్రీలు అంతకన్నా తక్కువగా నమోదై న సందర్భాలు అనేకం వున్నాయి. ఈ ఏడాది ఐదున్నర డిగ్రీల నుంచి పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదైన జిల్లాలు అనేకం వున్నాయి. గత ఏ డాది మాదిరిగానే ఈ ఏడాది కూడా చలికాలం నవంబర్ రెండవ వారంలో కానీ మొదలవ్వక పోవడం గమనార్హం. దీని తరువాత డిసెంబర్ నెలలోనే చలి తీవ్రత ఎక్కువగా కనిపించింది. రాష్ట్రంలో చలి ప్రభావం ఎక్కువగా వుండే ఆదిలాబాద్‌తో పాటు ఏజెన్సీ ప్రాంతంలో నెలన్నర్న రోజులు మినహాయించి మిగతా చోట్ల ఓ మోస్తరుగానే చలికాలమే కొనసాగిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనేక కారణాలను వారు ఉదహరించారు. ఆగ్నేయ భారతం నుంచి వీస్తున్న గాలులకు తోడుగా బంగాళాఖాతంలో ఏర్పడ వాతావరణ మార్పులు, ఆరుకు పైగా తుపాన్లు ఏ ర్పడడం ప్ర ధాన కారణంగా వారంటున్నారు. రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు అన్ని జిల్లాలలో పది డిగ్రీలు దాటడడం గ మనార్హం. ఇదే సమయంలో అత్యధిక ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలు దాటాయి. మరోవైపు జనవరి నెల మూడవ వారంలోనే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం గమనార్హం, వారం రోజుల తరువాత ఇవి మరింతగా పెరిగే వీలుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

**ఉష్ణమండల ప్రాంతంలో అనూహ్య వాతావరణ పరిస్థితులు:** ఇదిలావుండగా ఉష్ణమండల ప్రాంతమైన భారత ఉప ఖండంలో గడచిన కొన్నేళ్లుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు శాస్త్రజ్ఞులకు సైతం అంతు చిక్క డం లేదంటే అతిశయోక్తి కాదు. వానాకాలంలో ఎండల తీవ్రత పెరగడం, చలికాలంలో భారీ వర్షాలు కురవడం ఇందులో భాగమేనని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సముద్రాల్లో పెరిగిపోతున్న వేడి తీవ్రత, భూతలంపై ముఖ్యంగా ఉష్ణమండల దేశమైన భారత్ సహా దాని పొరుగు దేశాల్లో తీవ్ర ప్రభావం చూపుతోందని వారంటున్నారు. ఈ కారణంగానే వానాకాలం, చలికాలం ఆలస్యంగా రావడం, వేసవి కాలం మాత్రం ఠంచనుగా ఫిబ్రవరి నెలలోనే మొదలవడం ఇందులో భాగమేనని వారంటున్నారు. భారత ఉపఖండంలో వాతావరణ మార్పుల ప్రభా వం వానా కాలంపై ఎలావున్నా చలి కాలంలో పెద్దగా మార్పులు వుండేవి కావని గడచిన నాలుగేళ్లుగా చలికాలం చాలావరకు తగ్గిపోతుందని వాతావ రణ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. అక్టోబర్ నెల మూడవ వారంలో మొదలయ్యే చలి కాలం ఫిబ్రవరి నెలాఖరు వరకు అంటే దాదాపు నాలుగు నెలల కాలం వుండేదని, అయితే గడచిన నాలుగేళ్లుగా నవంబరు రెండవ వారంలో మొదలైన చలికాలం జనవరి మూడవ వారం నాటికే ముగింపుకు వస్తోందని వారంటున్నారు. ఇక చలికాలంలో చలి తీవ్రత ఎక్కువగా వుండేది డిసెంబరు, జనవరి నెలల మధ్యే. అంటే ఈ రెండు నెలల పాటు చలి ప్రభావం ఎక్కువగా వుంటుంది. ఈ ఏడాది జనవరి నెలలో ఇప్పటి వరకు పగటి పూట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల నుంచి 32 డిగ్రీల వరకు చేరింది. అంటే గత నెలకంటే కొంత పెరిగిందన్న మాట. ఇక రాత్రిపూట ఉష్ణోగ్రత 18 డిగ్రీల మధ్య వుంది. ఇది కూడా రెండు డిగ్రీ లు అదనంగా పెరిగిందని వాతారణ శాఖ అధికారులంటున్నారు.

ఆట

# టాటా స్టీల్ చెస్: ప్రజ్ఞానందతో గుకేశ్ డ్రా



**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026, రౌండ్ 4లో భారత్ గ్రాండ్ మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానానంద మధ్య మ్యాచ్ డ్రా అయింది. అలాగే భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ కూడా నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై డ్రాతో సరిపెట్టుకున్నాడు. గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞాన్ నాల్గవ రౌండ్‌లో తన రెండో డ్రాను స్వదేశీయుడు దొమ్మరాజుతో గుకేష్ ఆడాడు. బ్లాక్ పావులు కలిగి ఉన్న గ్రాండ్ మాస్టర్ అర్జున్, నెదర్లాండ్స్‌కు చెందిన అనిష్ గిరిపై 80-మూవ్‌ల గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీనివల్ల అతను ఉమ్మడి ఆధిక్యం నుండి కిందికి దిగజారాడు. అర్జున్ ఇప్పుడు 4ఆటల నుండి 2.5 పాయింట్లతో ఇద్దరుఉమ్మడి గ్రాండ్ మాస్టర్లు నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్) మరియు హాన్స్ నీమాన్ (అమెరికా) కంటే అర పాయింట్ వెనుకబడి ఉన్నాడు. ఇదే సమయంలో డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానంద తన నాలుగు ఆటలలో కేవలం 1 పాయింట్‌తో అనిష్‌తో పాటు పట్టికలో దిగువన వెనుకబడి ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ అరవింద్ చితంబరం ఈ టోర్నమెంట్‌లో తొలి ఓటమిని ఎదుర్కొన్నాడు. హాన్స్ నీమాన్ చేతిలో ఓడిపోయాడు. దీంతో అతడు పాయింట్ల పట్టికలో 1.5 పాయింట్లతో సంయుక్తంగా 10వ స్థానానికి పడిపోయాడు. నేడు జరిగే 5వ రౌండ్‌లో అతను జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో తలపడనున్నాడు. అదే సమయంలో, గుకేష్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన థాయ్ డై వాన్ న్గుయెన్‌తో, అర్జున్ స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్‌పై తలపడనున్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ విజయం

**న్యూఢిల్లీ:** పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లో భారత్ షట్లర్ యుకీ భాంబ్రీ, తన స్వీడిష్ భాగస్వామి ఆండ్రీ గోరాన్సన్‌తో కలిసి 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సునాయాస విజయంతో ప్రారంభించారు. మెల్‌బోర్న్ పార్క్‌లోని కోర్ట్ 13లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 10వ సీడ్ జంట జేమ్స్ డక్‌వర్త్ మరియు క్రజ్ హెవిట్‌ల స్వదేశీ జోడీపై 6-3, 6-4 తేడాతో వరుస సెట్‌లతో విజయం సాధించింది. యుకీ-గోరాన్సన్ జోడీ మొదటి సర్వ్‌లోనే 95 శాతం విజయ రేటును నమోదు చేశారు. 5 సర్వీస్ గేమ్‌లలో 4 గెలిచారు (40-0). మొదటి సెట్‌లో మూడు బ్రేక్ పాయింట్లను సాధించి, గేమ్9లో వాటిలో ఒకదాన్ని గోల్‌గా మార్చుకుని 6-3తో సెట్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ సెట్‌లో కూడా మొదటి నాలుగు సర్వ్ గేమ్‌లను లవ్‌పై గెలవగా (40-0) ఇందులో 4 ఏస్‌లు కూడా ఉన్నాయి. 7వ గేమ్‌లో ఇండోస్వీడిష్ ద్వయం జేమ్స్ డక్‌వర్త్ సర్వీస్‌పై సెట్‌లో తొలి బ్రేక్‌ను పొందారు. 10 పాయింట్ల డ్యూస్ గేమ్ ఆడినప్పటికీ మనుగడ సాగించలేకపోయాడు. ఆ తర్వాత, మ్యాచ్ చివరి గేమ్‌లో, గోరాన్సన్ ద్వయం తన సర్వీస్‌ను 40-15తో సులభంగా మలిచి సెట్‌ను గెలుచుకుని రెండవ రౌండ్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నారు.



### మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ముంబయి ఇండియన్స్ ఔట్

## ఫైనల్‌కు చేరడంపై సందిగ్ధం

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026, సీజన్ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఐదు జట్లు దాదాపు ఐదేసి లీగ్ మ్యాచ్‌లు ఆడాయి. ఈ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పాయింట్స్ టేబుల్‌లో 10 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఈ జట్టు నెట్ రన్ రేటు +1.882గా ఉంది. ఇక ఆరు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి ముంబై ఇండియన్స్ మెరుగైన +0.046 రన్‌రేట్‌తో 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. యూపీ వారియర్స్ ఆడిన ఐదు మ్యాచ్‌లో రెండు గెలిచి-0.483 నెట్‌రన్ రేట్‌తో మూడో స్థానంలోను, ఢిల్లీ క్యాపిటల్స్ ఐదు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి -0.586 నెట్‌రన్ రేట్‌తో 4 పాయింట్లతో నాల్గో స్థానంలోను, గుజరాత్ జెయింట్స్ రెండు గెలుపొంది -0864 నెట్‌రన్ రేట్ కలిగి నాల్గు పాయింట్ల తో చిట్టచివరిన ఐదో స్థానంలో ఉంది. దాంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తికరంగా మారింది. డబ్ల్యూపీఎల్ రూల్స్ ప్రకారం లీగ్ దశ మ్యాచ్‌లు ముగిసే సరికి పాయింట్స్ టేబుల్‌లో టాప్3లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానంలో నిలిచే జట్టు నేరుగా ఫైనల్ చేరనుండగా, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తోంది. ప్రస్తుతం ఆరు మ్యాచ్‌ల్లో రెండేసి విజయాలతో రెండో స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లకు రెండూ గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 8 పాయింట్స్ చేరుతాయి. దీంతో యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం అవుతుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి మాత్రమే గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరడం కష్టం. అద్భుతం జరిగితే తప్పా ఇది సాధ్యం కాదు. ఎందుకంటే ముంబై ఇండియన్స్ చివరి రెండు మ్యాచ్‌లకు మూడు గెలిచినా గరిష్టంగా 8 పాయింట్లు మాత్రమే సాధించగలదు. ఆర్‌సీబీ ఐదు మ్యాచ్‌లకు ఐదు గెలిచి 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆ జట్టు తమ చివరి మూడు మ్యాచ్‌లకు మూడింటిని ఘోరంగా ఓడిపోవడంతో పాటు ముంబై ఇండియన్స్ మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. ఇతర జట్లు కూడా 10 పాయింట్స్ సాధించవద్దు. అప్పుడే ముంబై ఇండియన్స్ నేరుగా ఫైనల్ చేరగలదు. ఇలా జరగడం అసాధ్యం. ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకొని ఎలిమినేటర్‌లో విజయం సాధిస్తేనే ముంబైకి ఫైనల్ బెర్త్ దక్కుతుంది.





# ప్రో రెజ్లింగ్ లీగ్‌లో ముంబయిపై పంజాబ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్ 2026లో 3-1 తేడాతో వెనుకబడి ఉన్న పంజాబ్ రాయల్స్ 6వ రోజు నాటకీయమైన మ్యాచ్‌లో అద్భుతమైన పునరాగమనం చేసి ముంబై దంగల్స్‌పై 6-3 తేడాతో విజయం సాధించింది. మహిళల 57 కిలోల పోటీలో కీలక మలుపు చోటు చేసుకుంది. అక్కడ రజనీత జాంగ్రా పతనంతో టైను సమం చేసింది. 74 కిలోల పోటీలో చంద్రమోహన్ గెలుపుతో పంజాబ్ ఊపందుకోగా, ఆ తర్వాత మీనాక్షి ఆధిపత్య విజయంతో మ్యాచ్‌ను ముగించింది. పంజాబ్ వరుసగా ఐదు బౌట్‌లను గెలిచిన నిర్ణయాత్మక ఆటను పూర్తి చేసింది. పంజాబ్ తరపున ఆడిన నలుగురు మహిళా రెజ్లర్లు విజేతలుగా నిలిచారు. 86 కిలోల పురుషుల బౌట్‌లో ముంబైలో టైగర్స్ ముకుల్ దహియా ద్వారా మొదటగా గోల్ చేశాడు. 62 కిలోల మహిళల పోటీలో పంజాబ్‌కు చెందిన కామన్వెల్త్ రజత పతక విజేత అనా గొడినెజ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 65 కిలోల పురుషుల విభాగంలో రోహిత్ రాహల్ వరుస టేక్‌డౌన్‌లతో ఆధిపత్యం చెలాయించినా తర్వాత బెలారస్‌కు చెందిన ఇస్లాం గుసేనోవ్‌పై ఓటమిచెందాడు. 57 కిలోల పురుషుల విభాగంలో కెప్టెన్ పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ చిరాగ్ చికారాను 17-7తో ఓడించి టైగర్స్‌ను 3-1తో ఆధిక్యంలో నిలిపాడు. 76 కిలోల మహిళల విభాగంలో ప్రియా మాలిక్ ప్రత్యర్థి జ్యోతి బెర్వాల్‌ను 10-0తో కమాండింగ్ షట్‌అవుట్ చేసి పంజాబ్‌ను పోటీలో దృఢంగా ఉంచింది. మహిళల 57 కిలోల విభాగంలో జాతీయ ఛాంపియన్ రజనితా జాంగ్రా ప్రారంభంలోనే టేక్‌డౌన్‌తో కొట్టింది, పీరియడ్ 2లో మరో టేక్‌డౌన్ మరియు టర్న్అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌తో స్కోరును 3-3గా చేసి నిర్ణయాత్మకంగా మార్చింది. 74 కిలోల పురుషుల విభాగంలో చంద్రమోహన్ ద్వారా పంజాబ్ తొలిసారిగా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అతడు 15-9 తేడాతో విజయం సాధించి పంజాబ్‌ను 4-3తో ఆధిక్యంలో ఉంచాడు.

### ఇండోనేసియా మాస్టర్స్‌లో..

# మెయిన్ డ్రాకు అన్మోల్, ఆకర్షి

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా మాస్టర్స్-2026 తొలి రౌండ్‌లో స్టార్ ఇండియన్ షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ పోరాట విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో జపాన్‌కు చెందిన మనామి సుయిజుపై 22-20, 21-28 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించడానికి ముందు సింధు నాలుగు గేమ్ పాయింట్లను కాపాడుకుంది. అలాగే 72 నిమిషాల మారథాన్ ఆట తర్వాత శ్రీకాంత్ 21-15, 21-13, 24-22 తేడాతో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న జపనీస్ షట్లర్ కోకి వటనాబేపై ను నిర్ణయాత్మక ఆటలో అధిగమించాడు. తర్వాత లక్ష ్య సేన్, అన్మోల్ ఖర్బ్ కూడా తమ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించారు. వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. లక్ష ్య 21-13, 16-21, 21-14 తేడాతో చైనీస్ తైపీకి చెందిన వాంగ్ త్జు వీని ఓడించగా, అన్మోల్ 21-16, 21





-17 తేడాతో పాయ్ యు పోపై విజయం సాధించాడు. అలాగే కిరణ్ జార్జ్, ఆకర్షి కశ్యప్ తమ తమ విభాగాలలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. కిరణ్ మోహ జాకి ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో 17-21, 14-21 తేడాతో ఓడిపోగా, ఆకర్షి రెండు మ్యాచ్ పాయింట్లను కోల్పోయి జూలీ జాకోబ్సెన్ (డెన్మార్క్) చేతిలో 21-8, 20-22, 17-21 తేడాతో, హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా మొదటి రౌండ్‌లో 19-21, 11-21 తేడాతో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత లీ జియ్ జియా (మలేషియా) చేతిలో ఓడిపోయారు. ధ్రువ్‌తనీషా వరుసగా మూడోసారి ఇస్టోరా సెనాయన్‌లో జరిగిన మరో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. భారత అగ్రశ్రేణి మిక్స్‌డ్ డబుల్స్ జంట ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టోల పేలవమైన ఫామ్ కొనసాగింది. తొలి రౌండ్‌లో ఈ జంట 21-23, 22-20, 21-6 తేడాతో దిగువ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ జంట జూలియన్ మాజో-లియా పలెర్మో చేతిలో ఓటమి ఎదుర్కొంది. దీంతో, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ప్రచారం ముగిసింది.

# మార్కెట్లకు తప్పని వరుస నష్టాలు

**ముంబయి, జనవరి 21:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా నష్టాల బాటలోనే పయనిస్తున్నాయి. బుధవారం బిఎస్‌ఇ ఒక మోస్తరునష్టాలు చవిచూసింది. సెన్సెక్స్ 270.84 పాయింట్లు, నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 81,794.65 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమైంది. ఒక దశలో 81,124.45 పాయింట్ల కనిష్టాన్ని చేరుకుంది. చివరకు 270.84 పాయింట్ల నష్టంతో 81,909.63 వద్ద ముగిసింది. నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి, 25,157.50 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల ధోరణులు, భౌగోళిక ఉద్రిక్తతలు, మార్కెట్ అనిశ్చితి వంటివి సెంటిమెంట్ ను దెబ్బతీయడంతో స్టాక్ మార్కెట్ నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ట్రెంట్, బిఇఎల్ ఎక్కువగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, రిలయన్స్, ఇండిగో, ఎటెర్నల్ వంటి సంస్థలు లాభాలు చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి విలువ మరింత తగ్గింది. అత్యల్ప కనిష్ట స్థాయి 91.73కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 64.33 వద్ద కొనసాగింది. బంగారం ధర ఔన్సుకు 4,862 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు భారతీయ మార్కెట్లో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. బుధవారం హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.53లక్షల వరకు చేరింది. ఇది అంతకుముందు రోజుతో పోలిస్తే రూ.9,000 అదనం. అంటే ఒక్కరోజులోనే తొమ్మిది వేల రూపాయలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42 లక్షలు గా ఉంది. వెండి కిలో ధర రూ.3.30లక్షలకు పైగానే ట్రేడవుతోంది. బిఎస్‌ఇలో 1437 కంపెనీలు పెరిగితే 2831 కంపెనీలషేర్లు క్షీణించాయి. మరో 142 కంపెనీల షేర్లుమాత్రం స్థిరంగానే కొనసాగాయి. ఇక బిఎస్‌ఇ ఎిడ్‌క్యాప్ కూడా 1.01శాతం, స్మాల్‌క్యాప్ సూచీ కూడా 0.80శాతం పతనం చెందాయి.



# ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం, వెండి

**ముంబయి, జనవరి 21:** దేశీయ మార్కెట్లో బంగారం ధర సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. బుధవారం మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసిఎక్స్)లో పసిడి ఫ్యూచర్స్ ధర మునుపెన్నడూ లేనంత గరిష్ఠస్థాయికి చేరింది. అమెరికా యూరప్ మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతుందన్న భయాలు, డాలర్ బలహీనపడటంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో ఎంసీఎక్స్‌లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా 4.25శాతం (సుమారు రూ. 4,100) పెరిగి 10 గ్రాములకు రూ.1,56,970 వద్ద సరికొత్త ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. ఎంసీఎక్స్ మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ ధర 2.71శాతం పెరిగి కిలోకు రూ. 3,32,451కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. కామెక్స్‌లో ఔన్స్ బంగారం ధర 4,849 డాలర్లకు చేరింది. ఫిబ్రవరి 1 నుంచి ఎనిమిది యూరోపియన్ దేశాలపై అమెరికా సుంకాలు విధించనుంది, జూన్‌లో ఈ సుంకాలను 25 శాతానికి పెంచవచ్చని వచ్చిన నివేదికలు ఈ ర్యాలీకి తోడయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలగా, ఇన్వెస్టర్లు బంగారం, వెండి వైపు మళ్లారని పృథ్వీఫిన్‌మార్ట్ కమోడిటీ రీసెర్చ్ విశ్లేషకులు మనోజ్ కుమార్ జైన్ తెలిపారు. దీనికి తోడు రూపాయి బలహీనపడటం కూడా దేశీయంగా ధరల పెరుగుదలకు మద్దతునిస్తోంది. సోలార్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎఐ వంటి రంగాల నుంచి వెండికి పారిశ్రామిక డిమాండ్ బలంగా ఉండటంతో దీర్ఘకాలంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న నెలల్లో ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.3.50 లక్షల స్థాయికి చేరవచ్చని భావిస్తున్నారు.



# ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

## డాలర్ వర్సెస్ రూపాయి 91.74



**ముంబయి, జనవరి 21:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆల్‌టైమ్ కనిష్టానికి చేరాయి. అంతర్జాతీయ కరెన్సీ మార్పిడికౌంటర్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 91.74 వద్ద ముగిసాయి. ఇప్పటివరకూ ఇదే అత్యంత కనిష్టస్థాయి అని తెలుస్తోంది. అమెరికా వాణిజ్య ఒప్పందంలో జాప్యం విదేశీ ఇన్వెస్టర్లు మార్కెట్లనుంచి ఎక్కువ పెట్టుబడులు విత్‌డ్రాచేయడం, అంతర్జాతీయంగా నెలకొన్న వాణిజ్య, రాజకీయ ఉద్రిక్తతలు కూడారూపాయి పతనానికి కారణంగా తెలుస్తోంది. డిసెంబరులో ఒకపర్యాయం రూపాయి 91 మార్కుకు చేరి ఆ తర్వాత రికవరీ అయింది. తిరిగి మళ్లీ బుధవారం రోజున ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. అత్యంత క్షీణత దశలో 91.08 వద్దప్రారంభం అయి రానురాను మరింత క్షీణించింది. కరెన్సీ వరుసగా ఆరోరోజు కూడా క్షీణించింది. ఎక్కువగా అమెరికా ట్రంప్ వైఖరి రూపాయీ క్షీణతను మరింత పెంచుతోంది. 2024లో రూపాయి 4.95శాతం క్షీణించింది. టర్కి లీరా, అర్జెంటీనా పెసో కరెన్సీలు కూడా సుమారు 50శాతం చొప్పున క్షీణించాయి. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.36వేల కోట్లకుపైగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. గత ఏడాది కూడా మార్కెట్లనుంచి సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కిపోయాయి. వీటివల్లకూడా డాలర్ డిమాండ్‌పెరిగింది. దీనివల్ల దేశీయ కరెన్సీపై ఒత్తిడిపెరిగింది.

# జొమాటో మాతృసంస్థ సిఇఒ రాజీనామా




**ముంబయి, జనవరి 21:** ప్రముఖ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో మాతృ సంస్థ అయిన ఎటెర్నల్‌లో కీలకమార్పులు జరిగాయి. కంపెనీ మూడవ త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో పాటు, యాజమాన్య నిర్మాణంలో పెను మార్పులను చేపట్టింది. సంస్థ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ సిఇఒ పదవి నుంచి తప్పుకోవడం ఇప్పుడు కార్పొరేట్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎటెర్నల్ గ్రూప్ సిఇఒగా ఉన్న దీపిందర్ గోయల్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన కంపెనీ నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. భవిష్యత్తులో కంపెనీకి సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయాల్లో భాగస్వామిగాఉంటూ, బోర్డు డైరెక్టర్‌గా, వైస్ ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. కొత్త, అధిక రిస్క్ కలిగిన ప్రాజెక్టులపై దృష్టి పెట్టడానికే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. దీపిందర్ గోయల్ స్థానంలో బ్లింకిట్ సిఇఒ అల్బీందర్ సింగ్ దిండ్సా ఎటెర్నల్ గ్రూప్ కొత్త సిఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్లింకిట్‌ను క్విక్ కామర్స్ రంగంలో తిరుగులేని శక్తిగా మార్చడంలో అల్బీందర్ చూపిన ప్రతిభను గుర్తించి ఈ పదవిని కట్టబెట్టారు. ఫిబ్రవరి 1, 2026 నుండి ఆయన ఈ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. యాజమాన్య మార్పుల వేళ కంపెనీ అద్భుతమైన ఆర్థిక ఫలితాలను సాధించింది. డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.102 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 59 కోట్లతో పోలిస్తే ఇది 73 శాతం వృద్ధి సాధించింది. గత ఏడాది రూ.5,405 కోట్లుగా ఉన్న రాబడులు, ఏకంగా 202 శాతం వృద్ధి చెంది రూ. 16,315 కోట్లకు చేరుకుంది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్ బ్లింకిట్ కీలక పాత్ర పోషించింది. బ్లింకిట్ తన నిర్వహణలో బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పట్టడం కంపెనీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అల్బీందర్ సింగ్ దిండ్సా నాయకత్వంలో బ్లింకిట్ సాధించిన ఈ విజయమే ఆయనను గ్రూప్ సిఇఒ స్థాయికి చేర్చిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# టెక్ దిగ్గజం మెటాలో భారీ లేఆఫ్‌లు




**సియాటెల్, జనవరి 21:** టెక్ దిగ్గజం మెటాలో ఉద్యోగుల కోతలు కొనసాగుతున్నాయి. తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన మెటావర్స్, వర్చువల్ రియాలిటీ విభాగాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ భారీ లేఆఫ్స్‌కు శ్రీకారంచుట్టారు. దాదాపు 15,000 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారు. ఇప్పటివరకు మెటావర్స్ కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను మెటా కుమ్మరించింది. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌కు తగినట్లుగా కొనసాగుతోంది. వీఆర్ హెడ్‌సెట్ల కంటే ఎఐ ఆధారిత స్మార్ట్ గ్లాసెస్, వేరబుల్ గ్యాడ్జెట్లపై పెట్టుబడి పెట్టడం మేలని భావించిన మెటా అందుకు అనుగుణంగానే ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ లేఆఫ్స్ నిర్ణయంపై ఓకులస్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 2017లో కొన్ని వివాదాల కారణంగా జుకర్‌బర్గ్ చేత తొలగించబడ్డ పామర్ ఇప్పుడు అదే జుకర్‌బర్గ్ నిర్ణయాన్ని సమర్థించారు. రెండేళ్లుగా మెటా వరుసగా వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తూనే ఉంది. తాజా లేఆఫ్స్‌తో రియాలిటీ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తొలగింపునకు గురైన వారికి మెటా తన ప్యాకేజీ నిబంధనల ప్రకారం పరిహారం అందజేయనుంది.




### టిసిఎల్‌తో సోనీ టైఅప్..

# కొత్త జాయింట్ వెంచర్

**ముంబయి, జనవరి 21:** హోం ఎంటర్‌టైన్‌మెంట్‌లో దిగ్గజంగా ఉన్న సోనీ ఇతర కంపెనీలతో భాగస్వామి అవుతోంది. ఎలక్ట్రానిక్స్ కంపెనీలు సోనీ, టిసిఎల్ భాగస్వామ్యం దిశగా ముందడుగు వేశాయి. ఈ మేరకు రెండు కంపెనీలు ఎంఒయులపై సంతకాలు చేశాయి. సోనీ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని నిర్వహించేలా ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు అవుతుంది. ప్రతిపాదిత నిర్మాణంలో టిసిఎల్‌కు 51 శాతం వాటా, సోనీకి 49 శాతం వాటా ఉంటుంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదని రెండు సంస్థలు స్పష్టం చేశాయి. ఈ చర్చలు తుది దశకు చేరితే కొత్త జాయింట్ వెంచర్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఉత్పత్తుల డిజైన్, డెవలప్మెంట్ నుంచి తయారీ, విక్రయాలు, లాజిస్టిక్స్, కస్టమర్ సర్వీస్ వరకు హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ మొత్తం చైన్‌ను జెవీ చూస్తుంది. టెలివిజన్లు, హోమ్ ఆడియో ఉత్పత్తులు ప్రధానంగా ఉంటాయి. రెండు కంపెనీలు 2026 మార్చి చివరికి బైండింగ్ ఒప్పందాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నాయి. అవసరమైన అనుమతులు లభిస్తే 2027 ఏప్రిల్‌లో కొత్త సంస్థ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్‌పై అభిరుచులు పెరుగుతుండటం ఈ భాగస్వామ్యానికి కీలక కారణంగా మారింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, వీడియో షేరింగ్ యాప్స్, స్మార్ట్ టీవీ ఫీచర్లు, అధిక రిజల్యూషన్ డిస్‌ప్లేలు వినియోగదారుల అలవాట్లను మారుస్తున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తూనే, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ పెంచడమే ఈ జాయింట్ వెంచర్ లక్ష్యం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.